తెలుగు దినపత్రిక

# సిరి

People's Voice వార్త పత్రిక

RNI TG TEL/ 26/A0381

13-08-2026

గురువారం హైదరాబాద్

సంపుటి: (volume): 1

సంచిక: (ISSUE): 186

PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–



తెలుగు దినపత్రిక సిరి People's Voice

RNI:TGTEL/26/A0381

siridailynews@gmail.com

/siridailynews

@siridailynews

విలేకరులు కావలెను

ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.

99897 78881, 7702344303, 9440451575




## రేవంత్ సోదరుల భూకుంభకోణం నిజం

- మేం టి హబు తెస్తే వారు అనుముల హబ్స్ దోపిడీ
- మరోసారి మాజీ మంత్రి కేటీఆర్ విమర్శలు

2



## బీఆర్ఎస్ నిలదీస్తే గానీ నోయి రాదా

- ఏపీ ప్రభుత్వ అజెండాపై ఎందుకు నోరు మెదపలేదు?
- బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు

2




# కార్పొరేట్ కబంధ హస్తాల్లో తెలంగాణ ఇంటర్ బోర్డు!

- ఓ యూనియన్ నేత నిర్ణయమే బోర్డు విధానమా?

- 20 ఏళ్లుగా ఒకే ఒక్కని శాసనం..
- 60 కళాశాలల ఫోర్జరీ అనుమతుల వెనుక బడా లాబీయింగ్
- కళాశాల అధ్యాపకుల యాంటిసిడెంట్ రిపోర్ట్ వచ్చాక ఆరునెలల మౌనానికి కారణమేంటి?
- ఇంటర్ బోర్డులో న్యాయం ఒక్కొక్కరికి ఒక్కోతీరా?
- రోజుకో లీకు అసలు విషయం పక్కకు
- కార్పొరేట్ సంస్థల నుండి కోట్లలో ముడుపులు ముట్టినట్లు ప్రచారం
- ప్రభుత్వ పెద్దలతో సాన్నిహిత్యంతో చక్రం తిప్పుతున్న యూనియన్ నేత

3




మిగతా 2వ పేజీలో..

### విద్యుత్ సంస్థ ఉద్యోగుల పదోన్నతులను
## ఆరునెలల్లో సమీక్షించాలి



- నష్టపోయిన బీసీ, ఓసి ఉద్యోగులకు న్యాయం చేయాలి
- రివ్యూలో నష్టపోయేవారి వాదనలూ వినాలి
- టీజీ హైకోర్టు ఆదేశం
- తదుపరి విచారణ 2027 ఫిబ్రవరి 18కి వాయిదా

3




### టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ కృషితో
## అంగన్‌వాడీ కేంద్రాల విద్యుదీకరణ పూర్తి



- మహిళలు, చిన్నారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు
- 100 శాతం లక్ష్యంతో 8,977 కేంద్రాలకు విద్యుత్ కనెక్షన్లు
- టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్

2



### ఇందిరమ్మ టవర్స్‌కు
## నేడు శ్రీకారం

- కూకట్‌పల్లిలో శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి
- ఏడాదిలో గృహ ప్రవేశాలు జరిగేలా ప్రణాళిక
- తొలి విడతలో 16 నియోజకవర్గాల్లో 8 వేల ఇళ్ల నిర్మాణం
- గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి

3



## కాంగ్రెస్ వి హత్యా రాజకీయాలు

వెంకటేశం కుటుంబానికి న్యాయం జరిగేదాకా అండగా ఉంటాం

కుటుంబాన్ని పరామర్శించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాత దర్యాప్తు చేయాలి

2

## కొత్త ఫ్యామిలీ సర్టిఫికెట్లకు ఈసీ నో

- ఓటరు జాబితా సవరణలో ఆమోదించబోమని స్పష్టీకరణ
- జీఓ 172 ప్రకారం మీసేవ ద్వారా జారీ చేసిన వాటికి అనుమతి లేదని వెల్లడి
- పాత విధానంలో తహశీల్దార్ విచారణతో పొందిన సర్టిఫికెట్లకు మాత్రం అంగీకారం

2






## జంతర్‌మంతర్ సీజన్2కు సిద్ధం

- త్వరలోనే కొత్త పోరాటం ప్రారంభిస్తాం: అభిజీత్ దీప్కే
- నిరసనల తేదీలు, డిమాండ్లను త్వరలో వెల్లడిస్తామని ప్రకటన
- యువతకు అండగా కొనసాగుతామని స్పష్టీకరణ

4



3

## రైతు సంక్షేమమే మా ప్రాధాన్యత

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల
- తుమ్మలతో బీహార్ వ్యవసాయ మంత్రి విజయ్‌కుమార్ భేటీ
- ఆయిల్‌పామ్‌పై బీహార్.. మకానాపై తెలంగాణ ఆసక్తి

## 78 మంది ఖైదీలు ఎస్.ఎస్.సి ఉత్తీర్ణత

- తెలంగాణలో మొదటిసారి
- ప్రత్యేక రిమిషన్ ప్రకటించిన జైళ్ల శాఖ డీజీ సౌమ్య

3





2

## నీటి వాటాలపై రాజీపడే ప్రసక్తి లేదు

- వాటాల్లో బిఆర్ఎస్ వల్లే తెలంగాణకు నష్టం
- అసత్యాలను ప్రచారం చేయడం అలవాటు చేసుకున్న కెటిఆర్
- మీడియా సమావేశంలో మండిపడ్డ మంత్రి శ్రీధర్ బాబు



# హర్ ఘర్ తిరంగాతో ఉప్పొంగుతున్న దేశ భక్తి

- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు**

**హైదరాబాద్, ఆగస్టు 12, సిరి న్యూస్ :**

దేశానికి స్వాతంత్య్రం వచ్చి 79 సంవత్సరాలు పూర్తవుతున్న శుభసందర్భాన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా 'హర్ ఘర్ తిరంగా' వేడుకలను నిర్వహించుకుంటున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు స్పష్టం చేశారు. పాత బస్తీలోని భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం నుంచి ప్రారంభమైన తిరంగా యాత్రలో యువత, ప్రజలు అశేష సంఖ్యలో పాల్గొని దేశభక్తిని చాటుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై కుటుంబ సమేతంగా మువ్వన్నెల జాతీయ జెండాను గర్వంగా, ఉత్సాహంగా ఎగురవేయాలని, తిరంగా యాత్రలో పాల్గొనాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. స్వాతంత్య్ర సమరయోధులు, సరిహద్దుల్లో ప్రాణాలర్పించిన వీర జవాన్ల అమూల్యమైన త్యాగాల పునాదులపైనే నేటి సగర్వ భారత్ నిర్మాణం జరిగిందని రామచందర్ రావు పేర్కొన్నారు. వికసిత్ భారత్ స్వప్నాన్ని సాకారం చేసుకునే దిశగా ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈనెల 14న ట్యాంక్ బండ్‌పై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి స్వామి వివేకానంద విగ్రహం వరకు నిర్వహించనున్న తిరంగా యాత్రను పవిత్రమైన దేశభక్తి కార్యక్రమలో రాజకీయాలకు అతీతంగా ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.

# ఎంఎస్ఎంఈ రంగాలు పురోగమించాలి

- **అప్పుడే దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం**
- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు**

**హైదరాబాద్, ఆగస్టు 12 , సిరి న్యూస్:**



దేశానికి స్వాతంత్య్రం వచ్చిన నాటినుండి నేటివరకు భారత్ ఎంతో ప్రగతి సాధించిందని, ముఖ్యంగా డిజిటల్ ఇండియా, సాంకేతిక అభివృద్ధి, పెట్టుబడుల సాధనలో దేశం మైలురాళ్లను అధిగమించిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎన్.రామచందర్ రావు గుర్తు చేశారు. ఎస్‌వీపీ ఆధ్వర్యంలో బుధవారం ఇక్కడ నిర్వహించిన సైన్స్ ఫండ్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. సైన్స్, శాస్త్రీయ ఆవిష్కరణల రంగానికి కూడా తగిన ఆర్థిక సహాయం అందించడం చాలా అవసరమని పేర్కొన్నారు. భారత దేశం అనేక రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా తనదైన ముద్ర వేసిందని, సైన్స్ రంగానికి కేవలం ప్రభుత్వం నుంచే కాక ప్రైవేట్ భాగస్వాముల నుంచి కూడా ఫండింగ్ పెరిగినప్పుడే నూతన ఆవిష్కరణలు, ఎంఎస్ఎంఈ రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని, తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ మరింత దృఢపడుతుందని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న 4వ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలవడం ప్రతి ఒక్కరికీ గర్వకారణమని రామచందర్ రావు అన్నారు. ఇటీవల ప్రారంభించిన య□పీఐ విధానం ద్వారా నేడు ప్రపంచవ్యాప్తంగా జరిగే మొత్తం డిజిటల్ లావాదేవీలలో ఒక్క భారతదేశానిదే 40 శాతం వాటా ఉండటం మన సాంకేతిక రంగానికి నిదర్శనమని చెప్పారు. ఇటువంటి తరుణంలో ఎస్‌వీపీ వంటి సంస్థలు ముందుకు వచ్చి నూతన ఆవిష్కర్తలకు, స్టార్టప్‌లకు ఫండింగ్ అందించి ప్రోత్సహించడం అభినందనీయమని, ఇది దేశానికి మరింత ఉజ్వలమైన ఆర్థిక భవిష్యత్తును అందిస్తుందని ఆకాంక్షిస్తూ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# కొత్త ఫ్యామిలీ సర్టిఫికెట్లకు ఈసీ నో

**హైదరాబాద్, ఆగస్టు 12, సిరి న్యూస్:**

తెలంగాణలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియలో కొత్తగా జారీ చేస్తున్న ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ల చెల్లుబాటుపై కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) స్పష్టత ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం జులై 25న జారీ చేసిన జీఓ 172 ప్రకారం మీసేవ ద్వారా జారీ చేసే ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్లను ఓటరు నమోదు, పరిశీలన ప్రక్రియలో గుర్తించలేమని తెలిపింది. ఈ మేరకు ఈసీఐ కార్యదర్శి నవీన్ కుమార్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి లేఖ రాశారు.

**రేషన్ కార్డుతో సమానంగా..**

గతంలో తహశీల్దార్లు క్షేత్రస్థాయిలో విచారణ చేసి, సంబంధిత పత్రాలను పరిశీలించిన తర్వాత ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లను జారీ చేసేవారని ఈసీఐ పేర్కొంది. అయితే జీఓ 172 ప్రకారం ముందస్తు విచారణ లేకుండానే రేషన్ కార్డు వివరాల ఆధారంగా మీసేవ ద్వారా రెండు రోజుల్లో సర్టిఫికెట్లు జారీ అవుతున్నాయని తెలిపింది. ఈ నేపథ్యంలో కొత్త సర్టిఫికెట్లను రేషన్ కార్డులతో సమానంగా పరిగణించాల్సి ఉంటుందని వివరించింది.

**పాత సర్టిఫికెట్లకు అంగీకారం**

రేషన్ కార్డు పౌరసత్వానికి నిశ్చయాత్మక ఆధారం కాదని, ఓటరు జాబితా పరిశీలనలో దానిని ప్రామాణిక పత్రంగా పరిగణించలేమని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఈసీఐ ప్రస్తావించింది. అందువల్ల జీఓ 172 కింద జారీ చేసే కొత్త ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్లను గుర్తింపు పత్రాలుగా స్వీకరించబోమని స్పష్టం చేసింది. అయితే జీఓ 172 అమల్లోకి రాకముందు, అంటే జులై 25, 2026కు ముందు తహశీల్దార్ క్షేత్రస్థాయి విచారణ అనంతరం పాత విధానంలో జారీ చేసిన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లను మాత్రం SIR పరిశీలనలో ఆమోదిస్తామని ఈసీఐ వెల్లడించింది.

# కోదండరాంకు నిరుద్యోగుల నిరసన సెగ

- **ఉద్యోగాల వయోపరిమితిపై నిలదీసిన యువత**
- **'60 ఏళ్లకు ఎమ్మెల్సీ.. 30 ఏళ్లకు ఉద్యోగం వద్దా?'**

**హైదరాబాద్, ఆగస్టు 12, సిరి న్యూస్:**

ఎమ్మెల్సీ, తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంకు నిరుద్యోగ యువత నుంచి నిరసన సెగ తగిలింది. హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రభుత్వ ఉద్యోగాల వయోపరిమితి పెంపుపై మాట్లాడేందుకు వచ్చిన ఆయనను నిరుద్యోగులు అడ్డుకుని నిలదీశారు. పెద్ద సంఖ్యలో యువత చుట్టుముట్టడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

**వయోపరిమితిపై ప్రశ్నలు**

'మీరు 60 ఏళ్ల వయసులోనూ సుప్రీంకోర్టు వరకు వెళ్లి ఎమ్మెల్సీ పదవి పొందగలిగారు. మాకు 30 ఏళ్లకే ఉద్యోగం చేసే అర్హత లేకుండా పోయిందా?' అంటూ నిరుద్యోగులు కోదండరాంను ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నమ్మి కాంగ్రెస్‌కు ఓటు వేశామని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగాల వయోపరిమితి, నోటిఫికేషన్ల అంశాలపై ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు.

**సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని డిమాండ్**

ఏళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూ మానసికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు.

## టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ కృషితో

# అంగన్‌వాడీ కేంద్రాల విద్యుదీకరణ పూర్తి

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**



తెలంగాణ పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుదీకరణ చేయాలన్న ప్రభుత్వ ఆశయాన్ని నెరవేరుస్తూ టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం విజయవంతంగా కల్పించారు. టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం కల్పించడానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సదుపాయాలు కల్పించడం ద్వారా చిన్నారుల ఆరోగ్యం, పోషణ, ప్రాథమిక విద్యాభివృద్ధి మరియు మహిళల సంక్షేమానికి మరింత మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. టీజీఎస్పీడీసీఎల్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో విద్యుదీకరణ పనులు వేగవంతంగా పూర్తయ్యాయి. డీఏజీజీయూఏ పథకం కింద టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో మొత్తం 9,234 విద్యుదీకరణ లేని అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించారు. వీటిలో 257 కేంద్రాలు విద్యుదీకరణ అవసరం లేని, విలీనం చేయబడిన కేంద్రాలుగా తేలగా, మిగిలిన 8,977 అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ కనెక్షన్లు విడుదల చేసి 100 శాతం లక్ష్యాన్ని సాధించారు. ఈ కార్యక్రమం రెండు దశల్లో అమలైంది. ఫేజ్ Iలో గుర్తించిన 7,297 అంగన్‌వాడీ కేంద్రాల్లో 7,073 కేంద్రాలకు విద్యుత్ కనెక్షన్లు విడుదల చేయగా, ఈ దశ జూలై 2026లో పూర్తయింది. అలాగే ఫేజ్ IIలో గుర్తించిన 1,937 కేంద్రాల్లో 1,904 కేంద్రాలకు విద్యుత్ కనెక్షన్లు విడుదల చేయగా, ఈ దశ ఆగస్టు 10, 2026 నాటికి పూర్తయింది.

**సీఎండీ జితేష్ వి. పాటిల్ హర్షం..**

ఈ సందర్భంగా టీజీఎస్పీడీసీఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారుల సమగ్ర అభివృద్ధికి, గర్భిణులు బాలింతల సంక్షేమానికి అత్యంత కీలకమైన సంస్థలన్నారు. ఈ కేంద్రాల్లో విద్యుత్ సదుపాయాలు కల్పించడం ద్వారా మెరుగైన విద్యా, ఆరోగ్య మరియు పోషణ సేవలను అందించే అవకాశాలు మరింత పెరుగుతాయని పేర్కొన్నారు. విద్యుత్ అందుబాటులో ఉండటం వల్ల అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ మరింత సమర్థవంతంగా మారుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో టీజీఎస్పీడీసీఎల్ భాగస్వామిగా నిలవడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించడంలో క్షేత్రస్థాయిలో అంకితభావంతో పనిచేసిన చీఫ్ ఇంజనీర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లు, డివిజనల్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, లైన్ సిబ్బంది మరియు ఉద్యోగులందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. వారి కృషి, నిబద్ధత వల్లే నిర్ణీత గడువులో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయగలిగామని కొనియాడారు. అంగన్‌వాడీ కేంద్రాల విద్యుదీకరణతో చిన్నారులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం, గర్భిణీలు మరియు బాలింతలకు మెరుగైన సేవలు, అంగన్‌వాడీ సిబ్బందికి మెరుగైన పని వాతావరణం అందుబాటులోకి రానున్నాయని అధికారులు తెలిపారు. ప్రజా సంక్షేమానికి సంబంధించిన ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలో టీజీఎస్పీడీసీఎల్ తనవంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా సామాజిక పురోగతికి తోడ్పడుతూనే ఉంటుందని.. నాణ్యమైన, నిరంతర విద్యుత్ సేవలతో తెలంగాణ అభివృద్ధి ప్రయాణంలో భాగస్వామిగా నిలుస్తామని జితేష్ వి. పాటిల్ స్పష్టం చేశారు.

# గిరిజనుల నిధులు, భూములు గోల్‌మాల్

**సిద్దిపేట, ఆగస్టు 12, సిరి న్యూస్ :**

గిరిజనుల సంక్షేమానికి కేటాయించిన నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం సక్రమంగా ఖర్చు చేయడం లేదని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆరోపించారు. గిరిజన యువత ఉద్యోగాల కోసం వెతికే స్థాయి నుంచి పదిమందికి ఉద్యోగాలు కల్పించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. సిద్దిపేటలో ట్రైబల్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన గిరిజన పారిశ్రామికవేత్తల అవగాహన సదస్సు, సిద్దిపేట జిల్లా చాప్టర్ ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గిరిజన యువతకు వ్యాపార అవకాశాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలపై అవగాహన కల్పిస్తూ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. గిరిజన యువతకు మార్గదర్శకంగా నిలవడంతోపాటు వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ప్రెజర్ గ్రూప్‌గా కూడా పనిచేయాలని సూచించారు. నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో చదివిన రమేష్ నాయక్ లండన్‌లో 16 హోటళ్లు స్థాపించి గొప్ప వ్యాపారవేత్తగా ఎదిగారని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో టీప్రైడ్ ద్వారా సహకారం పొందిన సురేష్ నాయక్ హైదరాబాద్‌లో హార్లిక్స్ బర్త్‌డే కేకులు తయారు చేస్తూ పెద్ద కంపెనీలతో పోటీపడుతున్నారని ఉదాహరణలుగా పేర్కొన్నారు. ఇలాంటి విజయగాథల నుంచి గిరిజన యువత స్ఫూర్తి పొందాలన్నారు. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గిరిజన అభివృద్ధికి వందల కోట్ల సబ్సిడీలు అందించామని, గిరిజన మహిళల కోసం రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేశామని, అనేక గురుకులాలను నిర్మించి నాణ్యమైన విద్యను అందించామని చెప్పారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత గిరిజనులకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లను 6 నుంచి 10 శాతానికి పెంచామని, దీంతో ఎంతోమంది గిరిజన యువత డాక్టర్లు, ఇంజనీర్లుగా ఎదిగారన్నారు. రాష్ట్రంలోని 3,300 తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి గిరిజన బిడ్డలను సర్పంచులుగా చేసి వారికి రాజ్యాధికారం అందించామని తెలిపారు. జనాభా ప్రాతిపదికన కేటాయించిన నిధులు ఆర్థిక సంవత్సరంలో ఖర్చు కాకపోతే మరుసటి ఏడాదికి క్యారీ ఫార్వర్డ్ అయ్యేలా ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని తీసుకొచ్చి అమలు చేశామని చెప్పారు. ఆరు లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇచ్చి గిరిజనులను రైతులుగా మార్చామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం గిరిజనులకు తీవ్ర ద్రోహం చేస్తోందని హరీశ్‌రావు విమర్శించారు. మేనిఫెస్టోలో పదో తరగతి పాస్ అయితే రూ.10వేలు, పీజీ చేస్తే రూ.2 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చినా అమలు చేయలేదన్నారు. అసెంబ్లీలో తాము ప్రశ్నించినప్పుడు ఎస్టీ కార్పొరేషన్‌కు రూ.2,730 కోట్లు కేటాయించామని ప్రభుత్వం చెప్పిందని, అయితే ఖర్చు చేసింది రూ.70 కోట్లు మాత్రమేనని తెలిపారు. ఒక్క గిరిజన బిడ్డకు కూడా ఉపాధి కల్పించలేదని విమర్శించారు. ఎస్టీ ఎస్డీఎఫ్ నిధులను బడ్జెట్‌లో కేటాయిస్తున్నా వాటిలో సగం కూడా ఖర్చు చేయడం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ భూములకు పట్టాలు ఇస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం లక్ష ఎకరాల అసైన్డ్ భూములను గుంజుకుని పేదలను రోడ్డున పడేసిందని హరీశ్‌రావు ఆరోపించారు. గిరిజనుల భూములను లాక్కుని ముఖ్యమంత్రి సోదరుడు కొండల్‌రెడ్డి, అల్లుడు సత్యకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. గిరిజన యువతకు అన్యాయం జరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో టీఐసిసిఐ మరింత చురుగ్గా పని చేయాలని హరీశ్‌రావు కోరారు. ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న సబ్సిడీలను రాబట్టేందుకు కృషి చేయాలని సూచించారు. జిల్లాలోని ఎస్టీ యువత టీఐసిసిఐ సేవలను సద్వినియోగం చేసుకుని సభ్యులుగా చేరాలని, నైపుణ్యాలను పెంచుకుని ఉద్యోగాలు కల్పించే స్థాయిలో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని హరీశ్‌రావు సూచించారు.

# కాంగ్రెస్ వి హత్యా రాజకీయాలు

**సిరిసిల్ల ఆగస్టు 12, సిరి న్యూస్ :**

పట్టణంలోని బీవై నగర్‌కు చెందిన నేత కార్మికుడు వెంగళ వెంకటేశం కుటుంబాన్ని బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ బుధవారం పరామర్శించారు. వెంకటేశం మృతిపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన కేటీఆర్ ఆయన భార్య, తల్లి, కుమార్తెను ఓదార్చి న్యాయం జరిగేదాకా ఆ కుటుంబం వెంటే ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటేశం మృతికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర దర్యాప్తు జరిపి ఘటనకు అసలు కారణాలు, బాధ్యులు, సూత్రధారులు ఎవరైనా వారిని వెలుగులోకి తీసుకురావాలని పోలీసులను డిమాండ్ చేశారు. కాంగ్రెస్ హత్యా రాజకీయాలు చేస్తున్నదని విమర్శించారు. తమపై రాజకీయ విమర్శలు చేయవచ్చని, కేసులు పెట్టవచ్చని, కానీ సామాన్య ప్రజలను రాజకీయాలకు బలిపశువులుగా మార్చడం సమర్థనీయం కాదన్నారు. వెంకటేశం కుటుంబ పరిస్థితిని చూసి తీవ్ర భావోద్వేగానికి గురైన కేటీఆర్ ఆయన చిన్నారి కుమార్తె తన తండ్రి కోసం ఎదురు చూస్తూ మూడు రోజులుగా తినలేదని చెప్పడం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. మనసున్న ఏ మనిషికైనా కన్నీళ్లు రాక మానవు.. గుండె ద్రవించక మానదు అని కేటీఆర్ అన్నారు.

అసలు సూత్రధారులను గుర్తించాలి

వెంకటేశం మృతి ఘటనలో కాంగ్రెస్ నాయకులు కొందరిని పోలీసులు అరెస్టు చేసినప్పటికీ వారు పాత్రధారులు మాత్రమేనని, అసలు సూత్రధారులు ఎవరన్నది తేల్చాల్సిన అవసరం ఉందని కేటీఆర్ అన్నారు. ఐదుగురిని అరెస్టు చేసినట్లు చెబుతున్నప్పటికీ వారిలో ఇద్దరిని రిమాండ్‌కు పంపి మిగతా ముగ్గురికి స్టేషన్ బెయిల్ ఇవ్వడంపై కూడా కేటీఆర్ ప్రశ్నలు లేవనెత్తారు. పోలీసుల రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. కొత్త ఇల్లు మంజూరు చేయాలని తాము కాంగ్రెస్ నాయకులను ఆశ్రయించినప్పటికీ నెలలతరబడి తిప్పించుకున్నారని కుటుంబీకులు తన దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. ఈ విషయంపై ఇప్పటికే కలెక్టర్‌తో మాట్లాడానని, కుటుంబానికి ఇల్లు మంజూరు చేయండి.. ఒకవేళ ప్రభుత్వం ఇవ్వలేని పరిస్థితి ఉంటే బీఆరఎస్ పార్టీ తరపున నిర్మించి ఇస్తాం.. మీరు మా ప్రయత్నానికి అడ్డుగా ఉండొద్దని కలెక్టర్‌కు చెప్పాను' అని కేటీఆర్ తెలిపారు.

**కుమార్తె భవిష్యత్ బాధ్యత నాదే**

తాను ఎమ్మెల్యేగా మాత్రమే కాక ఆ కుటుంబానికి మాట ఇచ్చిన సోదరుడిగా బాధ్యత తీసుకుంటున్నానని కేటీఆర్ అన్నారు. వెంకటేశం కుమార్తె ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్నదని, ఆ బాలిక పేరుపై రూ.3 లక్షలు డిపాజిట్ చేసినట్లు, ఆమె మేజర్ అయ్యాక ఆ మొత్తం అందుబాటులోకి వచ్చేలా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆమె చదువుతున్న పాఠశాలతో మాట్లాడి పదో తరగతి వరకు బాలిక ఫీజులు తదితర ఖర్చుల విషయంలో తాను వ్యక్తిగతంగా బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చానన్నారు. పదో తరగతి తర్వాత ఏం చదవాలనుకున్నా ఆమె చదువు కొనసాగించే బాధ్యత కూడా తీసుకుంటానని హామీ ఇచ్చారు. కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం కూడా పార్టీ తరపున అందించామన్నారు.వెంకటేశం మృతిని ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం జరిగిందన్న ఆరోపణలను కూడా కేటీఆర్ ప్రస్తావిస్తూ సమగ్ర దర్యాప్తు జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరారు. స్థానిక కాంగ్రెస్ నాయకత్వంపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు.

# బీఆర్ఎస్ నిలదీస్తే గానీ సోయి రాదా

**హైదరాబాద్, ఆగస్టు 12 , సిరి న్యూస్:**

తెలంగాణ ప్రాజెక్టులపై సమీక్షించాలని ఏపీ ప్రభుత్వం జీఆర్ఎంబీ సమావేశంలో ప్రస్తావించనుండడంపై బీఆరఎస్ ప్రశ్నించిన తర్వాత హడావుడిగా లేఖలు రాయడం తప్ప రాష్ట్ర ప్రయోజనాల పట్ల మీకు చిత్తశుద్ధి లేదా అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అసెంబ్లీలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు నిలదీశారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు మీ నామమాత్రపు లేఖలు రాష్ట్ర ప్రాజెక్టులను కాపాడతాయా అని ఒక ప్రకటనలో ప్రశ్నించారు. లేఖలతో పనులు కావు.. తెలంగాణ నీటి ప్రయోజనాల కోసం రాజీ లేని పోరాటం చేయాలి అని హితవు పలికారు. ఏపీ ప్రభుత్వం జీఆర్ఎంబీ అజెండాలో పెట్టిన అంశాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వాటిని అజెండా నుంచి తొలగించే వరకు తెలంగాణ ప్రభుత్వం పట్టుబట్టాలని, ఆ అంశాలను వెనక్కి తీసుకోకపోతే అవసరమైతే జీఆరఎంబీ సమావేశానికి హాజరు కాబోమని కరాఖండిగా తేల్చి చెప్పాలి అని అన్నారు. అలాకాకుండా మీ రాజకీయ అవసరాల కోసం సమావేశానికి వెళ్లి అక్కడ తెలంగాణ ప్రాజెక్టులపై ఏపీ పెట్టిన అభ్యంతరాలకు బలం చేకూర్చేలా వ్యవహరిస్తే మాత్రం బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదు అని హరీష్‌రావు హెచ్చరించారు. రేవంత్ రెడ్డీ.. ఇది రాజకీయాలకు సంబంధించిన విషయం కాదు.. తెలంగాణ భవిష్యత్తుకు సంబంధించిన విషయం.. తెలంగాణ నీటి హక్కులకు సంబంధించిన విషయం అని చెప్పారు. ప్రతిపక్షాలపై పిచ్చి ప్రేలాపనలు చేసే రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రాజెక్టులపై ఏపీ అభ్యంతరాలు చెబితే ఎందుకు నోరు మెదపడం లేదన్నారు. ఈ నెల 18న హైదరాబాద్‌లో జరిగే జీఆర్ఎంబీ సమావేశం అజెండాను ఉపసంహరించుకోకుండా నిర్వహిస్తే తెలంగాణ ప్రాజెక్టులను కాపాడుకునేందుకు బీఆరఎస్ పార్టీ వేలాదిమందితో జీఆరఎంబీ కార్యాలయాన్ని ముట్టడిస్తుందని హెచ్చరించారు. కేంద్రం చేతిలోని జీఆర్ఎంబీ, చంద్రబాబు, రేవంత్ కలిసి తెలంగాణకు చేస్తున్న జల ద్రోహాన్ని అడ్డుకుంటామన్నారు.

# రేవంత్ సోదరుల భూకుంభకోణం నిజం

**హైదరాబాద్, ఆగస్ట్12, సిరి న్యూస్:**

ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సోదరులు భూకుంభకోణాలకు పాల్పడుతున్నారని బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణలు గుప్పించారు. 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ ఇన్నోవేటర్ ఆఫ్ ది సెంచరీ'గా అనుముల కొండల్ రెడ్డిని ప్రకటించాలని ఎద్దేవా చేశారు. నిజమైన స్టార్టప్లు ఎదగాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి దక్కాలని తాము కష్టపడి టి హబ్'ను నిర్మిస్తే సీఎం రేవంత్ రెడ్డి మాత్రం తన కుటుంబ ప్రయోజనాల కోసం 'అనుముల హబ్స్' ఏర్పాటు చేయడంలో బిజీగా ఉన్నారని విమర్శించారు. ఇది ఫ్యామిలీరన్.. ఫ్యామిలీడ్రైవ్.. జీరో ఇన్నోవేషన్.. జీరో ఎంప్లాయీస్ స్కామ్ అంటూ ఆరోపించారు. అనుముల సోదరుల్లో ఒకరైతే చాలు.. ఎటువంటి ప్రశ్నలు లేకుండా వందల కోట్లు విలువైన భూములు దక్కించుకో వచ్చంటూ సెటైర్ విసిరారు. 'సున్నా పెట్టుబడితో టెస్రాక్ట్ అడ్వాన్స్డ్ సిస్టమ్ అనే డిఫెన్స్ కంపెనీ పెట్టి, రాత్రికి రాత్రే కనీసం రూ. 200 కోట్ల లాభం ఆర్జించినందుకు 'ఇన్నోవేటర్ ఆఫ్ ది సెంచరీ'గా అనుముల కొండల్ రెడ్డిని ప్రకటించాల్సిందే. శ్రీధర్ బాబు, రేవంత్ రెడ్డి.. తెలంగాణలోని లక్షలాది మంది నిరుద్యోగ యువతకు కూడా ఈ అద్భుతమైన 'బిజినెస్ మోడల్' ఏంటో నేర్పించండి. వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ఇంత చౌకగా ఎలా పొందాలో శిక్షణ ఇవ్వండి. ఈ మ్యాజిక్ ట్రిక్ కేవలం అనుముల కుటుంబానికే ఎందుకు పరిమితం కావాలి? తెలంగాణ యువత మొత్తానికి ఈ 'అనుములు హబ్' అవకాశాన్ని కల్పించండి' అంటూ కేటీఆర్ సెటైరికల్ కామెంట్స్ చేశారు.

# నీటి వాటాలపై రాజీపడే ప్రసక్తి లేదు

**హైదరాబాద్, ఆగస్టు 12 :**

తెలంగాణ నీటి వాటా విషయంలో ఎక్కడా రాజీపడబోమని పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. నీటి వాటాల్లో తెలంగాణకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర నష్టం చేసిందని విమర్శించారు. గాంధీ భవన్‌లో బుధవారం మంత్రులతో ముఖాముఖి కార్యక్రమం అనంతరం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీఆర్ఎంబీ సమావేశానికి హాజరవుతామని, నీటి వాటాపై బలంగా కొట్లాడతామని తేల్చి చెప్పారు. అసత్యాలతో ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారంటూ బీఆరఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై మండిపడ్డారు. కేసీఆర్ ఫాం హౌస్‌లో పండిన వరికి వచ్చిన ధర ఎంతో చెప్పాలంటూ ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. తాము రూ.కోటిన్నరకు ఇచ్చిన భూమిని బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 90 లక్షలకే ఇచ్చిందని గుర్తు చేశారు. నిబంధనల మేరకే భూ కేటాయింపులు జరిగాయని ఆయన వివరించారు. అయిదెకరాల భూమిని రూ.7.5 కోట్లకు ఇచ్చామని చెప్పారు. కేటీఆర్ చెబుతున్న రూ.200 కోట్లు ఎక్కడివో చెప్పాలని నిలదీశారు. హిల్ట్ పాలసీ వల్ల హైదరాబాద్ ప్రజలకు మేలు జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పారిశ్రామికవేత్తలను కేటీఆర్ భయపెట్టడం మంచిది కాదన్నారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడం సరైనది కాదని హితవు పలికారు. భూ కేటాయింపులపై కేటీఆర్ ఆరోపణలకు మంత్రి శ్రీధర్‌బాబు స్పందించారు. జీఆర్ఎంబీ సమావేశానికి హాజరై తెలంగాణకు రావాల్సిన నీటి వాటాల కోసం బలంగా వాదిస్తామని శ్రీధర్‌బాబు పునరుద్ఘాటించారు. తమపై ఉన్న కోపాన్ని రాష్ట్ర ప్రజలపై చూపవద్దని కేటీఆర్‌కు సూచించారు.

# కార్పొరేట్ కబంధ హస్తాల్లో తెలంగాణ ఇంటర్ బోర్డు!

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు వ్యవహారం రోజుకో కొత్త మలుపు తిరుగుతోంది. కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడం, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోకపోవడం వెనుక ఒక బడా యూనియన్ నేత హస్తం ఉందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఒకటి రెండు కాదు.. ఏకంగా రెండు దశాబ్దాల కాలంగా కార్పొరేట్ విద్యా సంస్థల అనుకూల నిర్ణయాల వెనుక సదరు నాయకుడి లాబీయింగ్ అత్యంత కీలకమని ఇంటర్ బోర్డు వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇంటర్ బోర్డులో ఏ చిన్న ఫైలు ముందుకు కదలాలన్నా ఆ నేత సైగ చేయాల్సిందేనని, ప్రభుత్వ పెద్దలకు అత్యంత సన్నిహితంగా మెలుగుతూ ఆయన ఆడిందే ఆటగా బోర్డు పరిపాలన సాగుతోందని తెలుస్తోంది.

**ఫోర్జరీ సంతకాల దందా వెనుక ఎవరున్నారు?**

ఇంటర్ బోర్డు అధికారుల నిర్లక్ష్య వైఖరిని ఆసరాగా చేసుకుని గల్లీకో కార్పొరేట్ కళాశాల వెలిసింది.పది బ్రాంచ్‌లు ఏర్పాటు చేస్తున్న సంస్థల్లో కనీసం ఐదింటికి అనుమతులు కూడా ఉండవు. ఆలా కార్పొరేట్ తప్పులకు వత్తాసు పలుకుతూ నిబంధనలను పట్టించుకోకున్న చర్యలు తీసుకోకపోవడం మూలంగా ఇంటర్ బోర్డు లో కార్పొరేట్ హవా నడుస్తోంది. అక్కడ జరిగే ప్రతి లాబీయింగ్ వెంక ఒక కీలక నేత చక్రం తిప్పుతాడన్నది ఆ శాఖలో బహిరంగ రహస్యం.ఇది ఆసరాగా చేసుకొని ఎలాగోలా ఇంటర్ బోర్డును బురిడీ కొట్టించవచ్చనే సదరు




యూనియన్ నేత మాస్టర్ ప్లాన్‌తోనే ఏకంగా 54 నుండి 60 కళాశాలలు ఫోర్జరీ సంతకాలతో కూడిన నకిలీ ఆక్యుపేషన్ సర్టిఫికెట్లతో అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. అయితే హైడ్రా చీఫ్ రంగనాథ్ సంతకం కూడా ఫోర్జరీ కావడంతో ఈ కుంభకోణం గుట్టు రట్టయింది. మొదట బయటపడ్డ 8 కళాశాలల ఫోర్జరీ ఎన్ఓసీ వ్యవహారంలో అంతా తానై చక్రం తిప్పిన ఈ నేతకు, కార్పొరేట్ యాజమాన్యాల నుంచి కోట్లలోనే ముడుపులు అందాయనే ప్రచారం తీవ్రంగా నడుస్తోంది.

**జేఎల్స్ వ్యవహారం లీక్ వెనుక పెద్ద కుట్ర**

ఇంటర్ బోర్డు ఇటీవల బయటపెట్టిన 37 మంది జూనియర్ కళాశాలల అధ్యాపకుల విద్యార్హతలకు సంబంధించిన 'యాంటిసిడెంట్స్ రిపోర్ట్' ఆరు నెలల క్రితమే బోర్డు వద్దకు చేరింది. అప్పట్లో ఆ వివరాలను తొక్కిపెట్టిన బోర్డు పెద్దలు, ఇప్పుడు నకిలీ ఎన్ఓసీల ఫోర్జరీ వ్యవహారం బయటకొచ్చిన వెంటనే మీడియాకు లీక్ చేయడం వెనుక ఒక భారీ కుట్ర దాగి ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నకిలీ ఎన్ఓసీల కుంభకోణంలో నిజమైన దోషులు, కార్పొరేట్ లాబీయిస్టుల పేర్లు బయటకు రాకుండా ప్రజా దృష్టిని మరల్చేందుకే, జూనియర్ లెక్చరర్ల విద్యార్హతల వివాదాన్ని విస్తృతంగా ప్రచారంలోకి తెచ్చి ఆ యూనియన్ నేత సఫలీకృతుడయ్యాడని చర్చించుకుంటున్నారు.

**కేసులు పెట్టి ముగించేస్తారా?**

ఇంటర్ బోర్డులో జరిగిన అధికారుల సంతకాల ఫోర్జరీ వ్యవహారంపై తొలుత 8 కళాశాలలపై కేసులు నమోదు చేశారు. ఆ తర్వాత మరో 50 కళాశాలలపై చర్యలు తీసుకుంటున్నామని ప్రకటించిన బోర్డు యంత్రాంగం, ఆ తర్వాత ఆ ఫైలును అక్కడే కోల్డ్ స్టోరేజీలో పెట్టేసింది. ఈ వ్యవహారం అంతటితో ఆగిపోవడం వెనుక కార్పొరేట్ లాబీయిస్టుల చక్రం తిప్పడమే కారణమని తెలుస్తోంది. ఒకవేళ ప్రభుత్వం గనుక ఇంటర్ బోర్డు పరిధిలోని కళాశాలల అనుమతులపై సమగ్ర విచారణ జరిపిస్తే, ఏళ్ల తరబడి సాగుతున్న వందల కోట్ల అవినీతి భాగోతం బయటపడుతుందని, అందుకే రోజుకో లీకు ఇస్తూ అసలు విషయాన్ని పక్కకు తోసేస్తున్నారని సమాచారం.

**ఒక్కరోజే జరిగిన విచారణ ఎందుకాగినట్టు?**

ఇంటర్ బోర్డులో నకిలీ ఎన్ఓసి ల దందా ఏళ్లుగా నడుస్తున్న ప్రక్రియ. ఇక్కడ బోర్డు ఇచ్చే అనుమతుల్లో చూపే పత్రాల్లో బోగస్( నకిలీ)వే ఎక్కువ ఉంటాయన్నది ఇంటర్ బోర్డులో అందరికి తెలిసిన విషయమే. అసలు నిబంధలనే పాటించని కార్పొరేట్ కళాశాలలు ఇంటర్ బోర్డు నిర్ణయాలనే శాసిస్తున్నాయన్నని జరుగుతున్న పరిణామాలే చెబుతున్నాయి. ఒకే రోజు 8 కళాశాలలు ఫోర్జరీ సంతకాలు చేసి నిర్వహణ అనుమతులు పొందాలని చుసినా వాటిపై నేటికీ చర్యలు లేవు. వీటికి తోడు 174 కళాశాలల అనుమతులు పరిశీలిస్తే 54 కళాశాలల యాజమాన్యాలు తప్పుడు పత్రాలు సమర్పించినట్టు బయటపడింది. వారిపైనా చర్యలుండవ్. ఇంకా ఎన్నో కళాశాలలలో ఇదే పరిస్థితి నెలకొన్నా ఇంటర్ బోర్డు పట్టించుకోదు. ఇందుకు కారణం కార్పొరేట్ లాబీయిస్టు కబంధ హస్తాల్లో ఇంటర్ బోర్డు చిక్కుకోవడమేనన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చిన్న సమస్యపై స్పందించే హైడ్రా అసలు ఎన్ని కళాశాలలకు ఎన్ఓసి ఇచ్చిందో ఇప్పటికి చెప్పడంలేదు. హైడ్రా కమిషనర్ మాత్రం తాము ఎన్ఓసి లు ఇవ్వడం లేదని చాల సార్లు ప్రకటించారు. మరి అలాంటప్పుడు ఇప్పటివరకు వచ్చిన ఏల్ఓసి లు అన్ని నకిలీ అన్నట్టేనా?లేదా ఏళ్లుగా జరుగుతున్న అవినీతి అక్రమాలు బయటకు రాకుండా ఒక్క కార్పొరేట్ లాబీయిస్టు చేసిన కృషి ఫలితంగా హైడ్రా మౌనం దాలుస్తోందా అన్నది తేలాల్సి ఉంది..వరుసగా జరుగుతున్న పరిమానాలతో తెలంగాణ సర్కారు కు చెడ్డ పేరు వస్తోంది. అయితే ప్రభుత్వ పెద్దలను సైతం ఆ లాబీయిస్టు ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఆపగలుగుతున్నాడని విశ్వసనీయ సమాచారం.

# విద్యుత్ సంస్థ ఉద్యోగుల పదోన్నతులను ఆరునెలల్లో సమీక్షించాలి

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

తెలంగాణ విద్యుత్ శాఖల పదోన్నతులను పునః సమీక్షించాలని తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఇప్పటివరకు తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ సంస్థల్లో ఉద్యోగులకు ఇచ్చిన పదోన్నతులన్నింటినీ రాబోయే ఆరు నెలల గడువులోగా పునఃసమీక్షించాలని జస్టిస్ నగేష్ బీమాపక ధర్మాసనం ఆదేశించింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ తేదీ అయిన 2014 జూన్ 2 నుంచి కల్పించిన అన్ని పదోన్నతులను సమీక్షించాలని పలు కేసుల విచారణ సందర్భంగా ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసుల వివరాలను పరిశీలిస్తే.. తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోడెపాక కుమార స్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యం వెంకన్న గౌడ్, తెలంగాణ విద్యుత్ ఓసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి. భాను ప్రకాష్, రాష్ట్ర అధ్యక్షులు ఆర్. సుధాకర్ రెడ్డి తదితరులు హైకోర్టులో వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై సుదీర్ఘ వాదనలు విన్న హైకోర్టు ఈ తీర్పు వెలువరించింది. పిటిషనర్ల తరపున న్యాయవాదులు ఎం. సురేందర్ రావు, గోడశివ, దేవర సంహిత, విద్యుత్ యాజమాన్యాల తరపున సీనియర్ న్యాయవాది జి. విద్యాసాగర్, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం తరపున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపించారు. వాదప్రతివాదనల అనంతరం హైకోర్టు గతంలో సీఎండీలపై ఉన్న కోర్టు ధిక్కరణ కేసులను మూసివేసింది. 2019లో ఓసీ అసోసియేషన్ తీర్పును సమీక్షించడానికి అనుమతిస్తూ, 2018లో తెలంగాణ హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం స్టేట్ ఆఫ్ తెలంగాణ వర్సెస్ ఎస్. ప్రకాష్ కేసులో ఇచ్చిన తీర్పును ఉటంకించింది. ఆ తీర్పులోని నియమాల ఆధారంగా విద్యుత్ సంస్థల్లో పదోన్నతులను సమీక్షించి, నష్టపోయిన బీసీ, ఓసీ ఉద్యోగులకు తగిన పదోన్నతులు కల్పించాలని ఆదేశించింది. అదే సమయంలో, ఈ సమీక్షలో భాగంగా నష్టపోయే వారి వాదనలు వినడానికి కూడా అవకాశం కల్పించాలని స్పష్టం చేస్తూ కేసును 2027 ఫిబ్రవరి 18కి వాయిదా వేసింది.

**ఉద్యోగుల్లో నెలకొన్న చర్చ, ఆందోళన..**

హైకోర్టు ఇచ్చిన ఈ మధ్యంతర ఉత్తర్వుల నేపథ్యంలో విద్యుత్ యాజమాన్యాలు ఎలాంటి నిర్ణయం తీసుకుంటాయనే దానిపై ఉద్యోగుల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2015లో వేలాది మందికి షరతులతో కూడిన పదోన్నతులు కల్పించి, ఆంధ్ర స్థానికత కలిగిన సుమారు 1154 మంది ఉన్నత స్థాయి ఉద్యోగులను ఏకపక్షంగా రిలీవ్ చేశారు. అయితే 2022లో సుప్రీంకోర్టు ఆ చర్యను తప్పుపట్టి, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించింది. దీంతో 2015 నుంచి ఇచ్చిన పదోన్నతులన్నింటినీ రద్దు చేస్తూ అనేక మంది తెలంగాణ ఉద్యోగులకు రివర్షన్లు ఇచ్చారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పదోన్నతుల్లో రిజర్వేషన్లు, సీనియారిటీ సమస్యలను పరిష్కరించకుండా గత యాజమాన్యాలు 2022లో వందలాది మందికి షరతులతో కూడిన ప్రమోషన్లు ఇచ్చాయి. 2024లో ఓసీ అసోసియేషన్ దాఖలు చేసిన పిటిషన్‌పై సమీక్ష దాఖలు చేస్తూ మరో 5900 మందికి షరతులతో కూడిన పదోన్నతులు కల్పించారు. 2025లో బీసీ ఉద్యోగుల సంఘం పిటిషన్ విచారణ సందర్భంగా ఏప్రిల్ 28న హైకోర్టు రెగ్యులర్ ప్రమోషన్లపై స్టే విధించడంతో, అప్పటినుంచి ఇన్‌చార్జి పదోన్నతులతోనే కాలం వెళ్లదీస్తున్నారు. ఇన్చార్జి పదోన్నతులతో ఎలాంటి ఆర్థిక లాభం లేకుండానే పలువురు ఉద్యోగులు రిటైర్ అవుతున్నటువంటి సంకట



పరిస్థితులు నెలకొన్నాయి. హైకోర్టు తాజా ఉత్తర్వులను స్వాగతిస్తున్నామని, విద్యుత్ యాజమాన్యాలు వెంటనే స్పందించి పదోన్నతులను సమీక్షించి బీసీ, ఓసీ ఉద్యోగులకు న్యాయం చేయాలని బీసీఓసీ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి నాయకులు కోడెపాక కుమార స్వామి, ముత్యం వెంకన్న గౌడ్, ఆర్. సుధాకర్ రెడ్డి, సి. భాను ప్రకాష్ తదితరులు డిమాండ్ చేస్తున్నారు

# రైతు సంక్షేమమే మా ప్రాధాన్యత

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల
- తుమ్మలతో బీహార్ వ్యవసాయ మంత్రి విజయ్‌కుమార్ భే□టీ
- ఆయిల్‌పామ్‌పై బీహార్.. మకానాపై తెలంగాణ ఆసక్తి
- సాంకేతికత, ఉత్పాదకత, పంటల వైవిధ్యీకరణపై మంత్రుల చర్చ

**హైదరాబాద్, ఆగస్టు 12, సిరి న్యూస్ :**

రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, వారి కోసం రెండున్నరేళ్లలో రూ.1.30 లక్షల కోట్లు ఖర్చు చేశామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బీహార్ వ్యవసాయ శాఖ మంత్రి విజయ్ కుమార్ సిన్హా మంత్రి తుమ్మలను సచివాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రెండు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, ఉత్తమ విధానాల అధ్యయనం, పంటల వైవిధ్యీకరణ తదితర అంశాలపై ఇరువురూ విస్తృతంగా చర్చించారు. వాతావరణ హెచ్చరికలను రైతులకు చేరవేయడం, రైతు నేస్తం ద్వారా రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అనుసంధానం, క్రాప్ బుకింగ్, శాటిలైట్ ఆధారిత పంటల పర్యవేక్షణ, యూరియా బుకింగ్ అప్లికేషన్, అగ్రిస్టాక్ ద్వారా రైతు గుర్తింపు వంటి డిజిటల్ కార్యక్రమాల గురించి వివరించారు. కృత్రిమ మేధ ఆధారిత 'కృషివాస' పంటల పర్యవేక్షణ వ్యవస్థ ద్వారా పంటల్లో సమస్యలను ముందుగానే గుర్తించి అవసరమైన ప్రాంతాల్లో సత్వర చర్యలు చేపట్టడం ద్వారా రైతుల పెట్టుబడి వ్యయాన్ని తగ్గించడం, దిగుబడిని పెంచడం, లాభదాయకతను మెరుగుపర్చే విధానాలను మంత్రి తుమ్మల వివరించారు. రైతుబంధు, రైతు బీమా, సన్న వడ్లకు బోనస్ తదితర కార్యక్రమాల అమలు తీరు గురించి బీహార్ మంత్రికి తెలిపారు. రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి సుమారు రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల వరకు రుణ మాఫీ చేశామని, సంవత్సరానికి రైతుభరోసా పథకం కింద ఎకరానికి రూ.12,000 ఇస్తున్నామని చెప్పారు. సన్నాలకు రూ.500 బోనస్ అందిస్తున్నామని, దేశంలోనే అత్యధిక వరి పండించిన రాష్ట్రం తెలంగాణే అని తెలిపారు. పంటల వైవిధ్యీకరణకు ఇస్తున్న ప్రాధాన్యతను కూడా మంత్రి తుమ్మల వివరించారు. తెలంగాణలో వరి, పత్తితోపాటు మొక్కజొన్న, కందులు, సోయాబీన్, మామిడి, ఎర్ర మిరప, పసుపు, ఆయిల్‌పామ్ తదితర పంటల సాగును విస్తరిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఆయిల్‌పామ్ సాగులో తెలంగాణ దేశంలో ముందంజలో ఉందని, 202526లో 3.11 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు ఉండగా, 74వేల మెట్రిక్ టన్నుల క్రూడ్ పామ్ ఆయిల్ ఉత్పత్తితో 20.01 శాతం ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేషియో సాధించినట్లు చెప్పారు. ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, నర్సరీలు, ప్రాసెసింగ్ మిల్లులు, మైక్రో ఇరిగేషన్ వంటి మౌలిక సదుపాయాలపై కూడా బీహార్ మంత్రి ఆసక్తిగా వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**బీహార్‌లో 91 శాతం మంది చిన్న, సన్నకారు రైతులు**

బీహార్‌లో అమలు చేస్తున్న వ్యవసాయ విధానాలు, పంటల వైవిధ్యీకరణ, పంటల క్లస్టర్ల విధానం, సాంకేతిక వినియోగం తదితర అంశాలను బీహార్ మంత్రి విజయ్ కుమార్ సిన్హా తెలంగాణ ప్రతినిధులకు వివరించారు. బీహార్‌లో చిన్న, సన్నకారు రైతులు 91 శాతం ఉండగా, వ్యవసాయంపై ఆధారపడే జనాభా 77 శాతంగా ఉందని, వ్యవసాయ ఉత్పత్తుల వైవిధ్యానికి అనుగుణంగా ప్రత్యేక పంటల క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా మకానా, మొక్కజొన్న, పండ్లుకూరగాయలు, తృణధాన్యాల కోసం ప్రత్యేక క్లస్టర్లను ఏర్పాటు చేసి ఉత్పత్తి, విలువ జోడింపు, మార్కెటింగ్ రంగాల్లో అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు బీహార్ ప్రతినిధులు వివరించారు. దర్భంగా, మధుబని, సీతామర్హి ప్రాంతాల్లో మకానా క్లస్టర్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. బీహార్‌లో మకానా పంటపై ప్రత్యేకంగా చేపడుతున్న కార్యక్రమాల పట్ల మంత్రి తుమ్మల ఆసక్తి కనబరిచారు. ఇటీవల మకానా ఉత్పత్తి, పరిశోధన, విలువ జోడింపు, మార్కెటింగ్, అంతర్జాతీయ అవకాశాలను పెంపొందించేందుకు మకానా బోర్డును ఏర్పాటు చేసినట్లు బీహార్ ప్రతినిధులు వివరించారు. గత పదేళ్లలో మకానా సాగు విస్తీర్ణం, ఉత్పత్తి, ఉత్పాదకత 2.5 రెట్లకు పైగా పెరిగినట్లు వివరించారు.

**ఆయిల్‌పామ్‌పై బీహార్, మకానాపై తెలంగాణ ఆసక్తి**

బీహార్‌లో ఆయిల్‌పామ్ సాగు అవకాశాలపై ఆ రాష్ట్ర మంత్రి ఆసక్తి వ్యక్తం చేయగా బీహార్‌లో ప్రత్యేకంగా సాగవుతున్న మకానా పంట, దాని ఉత్పత్తి, విలువ జోడింపు, మార్కెటింగ్ విధానాలపై మంత్రి తుమ్మల ఆసక్తి చూపారు. రెండు రాష్ట్రాల్లో రైతులకు ప్రయోజనం చేకూరే పంటల పరస్పర అధ్యయనం, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడికి దోహదం చేసుకోవాలని మంత్రి తుమ్మల కోరారు. ఇందుకోసం ఆయిల్‌పామ్ సాగు విధానాలను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు బీహార్ నుంచి వ్యవసాయ శాఖ అధికారులు, ప్రతినిధుల బృందంతోపాటు రైతుల బృందాన్ని తెలంగాణకు ఆహ్వానిస్తున్నామన్నారు. తెలంగాణలో ఆయిల్‌పామ్ తోటలు, నర్సరీలు, ప్రాసెసింగ్ యూనిట్లు, సాగులో అనుసరిస్తున్న ఆధునిక విధానాలను వారు ప్రత్యక్షంగా పరిశీలించేలా ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. అదేవిధంగా మకానా సాగు, ప్రాసెసింగ్, విలువ జోడింపు, మార్కెటింగ్ విధానాలను అధ్యయనం చేసేందుకు తెలంగాణ నుంచి ప్రతినిధుల బృందాన్ని బీహార్‌కు పంపిస్తామని తెలిపారు. బీహార్‌లో ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, నాణ్యమైన నాటు సామగ్రి, సాగు విధానాలు, మైక్రో ఇరిగేషన్, ప్రాసెసింగ్ తదితర అంశాల్లో తెలంగాణ ప్రభుత్వం తనవంతు సహాయసహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. వ్యవసాయ రంగంలో రెండు రాష్ట్రాలకు ఉన్న ప్రత్యేక అనుభవాలు, సాంకేతిక పరిజ్ఞానం, పంటల వైవిధ్యీకరణ విధానాలను పరస్పరం పంచుకోవడం ద్వారా రైతుల ఆదాయం పెంపు, ఉత్పాదకత మెరుగుదల, విలువ జోడింపు, మార్కెట్ అవకాశాల విస్తరణకు మరింత ప్రయోజనం కలుగుతుందని మంత్రులు అభిప్రాయపడ్డారు. తెలంగాణబీహార్ మధ్య వ్యవసాయ సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, హాకా ఎండీ చంద్రశేఖర్ రెడ్డి, కో ఆపరేటివ్ కమిషనర్ రాహుల్‌రాజ్, హార్టికల్చర్ యూనివర్సిటీ వీసీ రాజిరెడ్డి, బీహార్ వ్యవసాయ శాఖ సెక్రటరీ నర్మదేశ్వర్ లాల్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ ముకేష్ కుమార్‌లాల్, హార్టికల్చర్ డైరెక్టర్ అభిషేక్ కుమార్ పాల్గొన్నారు.

# ఆర్మీ రిక్రూట్‌మెంట్ కోసం శిక్షణ ఇవ్వాలి

**హైదరాబాద్,ఆగస్ట్ 12, సిరి న్యూస్:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని భారత ఆర్మీ సదరన్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ఇన్‌చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ సి.రాజేష్ పుష్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు. భారత ఆర్మీ చేపట్టే వివిధ నియామకాల్లో తెలంగాణ యువతను ప్రోత్సహించే విధంగా కలిసి పనిచేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా సీఎం తెలియజేశారు. ఆర్మీ నియామకాల్లో స్థానిక యువతకు భారీ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఆసక్తి చూపుతున్న, అనువైన జిల్లా కేంద్రాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. దేశవ్యాప్తంగా నిర్వహించే వివిధ ఆర్మీ రిక్రూట్మెంట్‌లకు ముందు ఆయా తెలంగాణ జిల్లా కేంద్రాల్లో యువతకు శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ సుముఖత వ్యక్తం చేశారు. అలాగే, విపత్తు నిర్వహణలో ఆర్మీ పాత్రపైనా సీఎం చర్చించారు. రాష్ట్రంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ ఆపరేషన్లు, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పునరావాస చర్యల్లో ఆర్మీ యంత్రాంగం మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని కోరారు. తెలంగాణలో విపత్తు పరిస్థితుల్లో ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని స్థానిక ఆర్మీ అధికారులను ఆదేశిస్తామని రాజేష్ పుష్కర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టును ఆయన కొనియాడారు. హైదరాబాద్ నగరాన్ని రక్షించడానికి, కాలుష్యాన్ని తగ్గించడానికి, చారిత్రక వైభవాన్ని తిరిగి తెచ్చేందుకు మూసీ నది పునరుజ్జీవం అవసరమని పేర్కొన్నారు. ఈ భేటీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మేజర్ జనరల్ శ్రీనివాస్ రావు, ఇతర ఆర్మీ ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మిల్లర్ల నుండి బకాయిలు వసూలు చేయాల్సిందే

**హైదరాబాద్, ఆగస్టు 12, సిరి న్యూస్ :**

డిఫాల్ట్ అయిన రైస్ మిల్లర్ల నుండి బకాయిలను వసూలు చేయాలి అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో సివిల్ సప్లయిస్ విభాగంపై పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలిసి బుధవారం సమీక్ష నిర్వహించారు. బకాయిల వసూలుకు ఒక విధానాన్ని రూపొందించాలన్నారు. దీనిపై కేబినెట్ సబ్ కమిటీలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని, బకాయిల వసూలే ప్రధాన లక్ష్యంగా చర్యలు ఉండాలని అన్నారు. మిల్లర్ల బ్లాక్ మెయిల్‌ను సహించనని సీఎం హెచ్చరించారు. ఉద్దేశపూర్వకంగా డిఫాల్ట్ అయి బకాయిలు చెల్లించని రైస్ మిల్లులను స్వాధీనం చేసుకుని మహిళా సంఘాలకు అప్పగించే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు. మార్కెట్‌లో ఉన్న గోడౌన్‌లను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని, అవసరమైతే మిల్లింగ్ బాధ్యతల్ని మహిళా సంఘాలకు బాధ్యతలు అప్పగిస్తాని అన్నారు. ఐదు నియోజకవర్గాల్లో మహిళా సంఘాలకు 50 నుంచి 100 ఎకరాల్లో గోడౌన్‌ల నిర్మాణం కోసం పైలట్ ప్రాజెక్టు చేపట్టాలన్నారు. ధాన్యం ఎక్కువ దిగుబడి అయ్యే ప్రాంతాలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయాలని, గోడౌన్‌ల నిర్మాణంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను వినియోగించుకోవాలని, ప్రతి జిల్లాకు నోడల్ అధికారిని నియమించాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సమీక్షా సమావేశంలో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ టవర్స్‌కు నేడు శ్రీకారం

**హైదరాబాద్, ఆగస్టు 12 , సిరి న్యూస్:**

హైదరాబాద్ మహానగరంలో ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల కలను సాకారం చేసే దిశగా ప్రజా ప్రభుత్వం మరో చరిత్రాత్మక అడుగు వేస్తోందని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. క్యూర్ పరిధిలో చేపడుతున్న ప్రతిష్ఠాత్మక ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి గురువారం (13వ తేదీ) సాయంత్రం కూకట్‌పల్లి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని వెల్లడించారు. ఇళ్ల నిర్మాణంపై అధికారులతో మంత్రి బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూకట్‌పల్లిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్న ఐదు ఎకరాల స్థలంలో నాలుగు టవర్స్ నిర్మిస్తామని, ఒక్కో టవర్‌లో 120 చొప్పున ఫ్లాట్స్ ఉంటాయని చెప్పారు. ఒక్కో అంతస్తులో 12 ఫ్లాట్స్ ఉండేలా 480 ఫ్లాట్స్ నిర్మాణం జరుగుతుందని, ఇందుకు రూ.43.20 కోట్లు ఖర్చవుతుందని తెలిపారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ఇంతవరకు సుమారు 90 ఎకరాలను ఎంపిక చేశామన్నారు. హైదరాబాద్ నగరం నడిబొడ్డున పేదవాడి ఇంటికి పునాది వేయడం అంటే కేవలం ఒక భవనం నిర్మించడం కాదు.. ఒక కుటుంబానికి భద్రత, ఒక తరానికి భరోసా, పేదవాడికి గౌరవంతో కూడిన జీవితం అందించడమే అని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో భూముల ధరలు ఆకాశాన్ని తాకుతున్న నేపథ్యంలో నగరంలోనే సొంత ఇల్లు కావాలనే పేదల ఆకాంక్షను నెరవేర్చేందుకు ఇందిరమ్మ టవర్స్‌ను ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందన్నారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం హైదరాబాద్ గృహ నిర్మాణ రంగంలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదలు నగరానికి దూరంగా కాకుండా.. నగరంలోనే గౌరవంగా జీవించాలి అనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును రూపొందించిందన్నారు. నగరంలోని కీలక ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను సద్వినియోగం చేసుకుని బహుళ అంతస్తుల టవర్లను నిర్మించడం ద్వారా వేలాది పేద కుటుంబాలకు సొంతింటిని అందించనున్నామని తెలిపారు. ఇది ఒకసారి చేపట్టి ముగించే పథకం కాదని, హైదరాబాద్‌లో పేదల గృహ అవసరాలను దశలవారీగా తీర్చే నిరంతర గృహ నిర్మాణ కార్యక్రమని స్పష్టం చేశారు. క్యూర్ పరిధిలో ఈ ఏడాది లక్ష ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, తొలి విడతలో ప్రయోగాత్మకంగా 16 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సుమారు ఎనిమిది వేల ఇళ్లను నిర్మించనున్నట్లు వెల్లడించారు. గత నెల 20నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించామని, ఇప్పటివరకు సుమారు 50 వేల దరఖాస్తులు అందాయని మంత్రి తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 15 వరకు పొడిగించినట్లు చెప్పారు. ఇందిరమ్మ టవర్స్‌లో లబ్ధిదారులకు అందించే ఇళ్లు సౌకర్యవంతంగా, ఆధునిక ప్రమాణాలతో నిర్మించనున్నామని తెలిపారు. నగరంలోని అత్యంత కీలక ప్రాంతాలను గుర్తించి అవసరాన్నిబట్టి పది అంతస్తుల వరకు టవర్లను నిర్మించనున్నట్లు వివరించారు. ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న ఈ ఇళ్లలో లబ్ధిదారుడి పేరుతో అన్‌డివైడెడ్ షేర్ కింద సుమారు 20 నుంచి 25 గజాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. కొన్ని ప్రాంతాల్లో ఒక్కో లబ్ధిదారుడికి లభించే భూమి వాటా విలువ రూ.60 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉంటుందన్నారు. ఇలాంటి విలువైన ప్రాంతాల్లో పేదలకు సొంతింటి అవకాశం కల్పించడం దేశంలోని ఇతర మహానగరాలకు కూడా ఆదర్శంగా నిలిచే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయ్యాక అర్హతలను పూర్తిస్థాయిలో పరిశీలించి ఎలాంటి రాజకీయ జోక్యం, సిఫారసులు, అవకతవకలకు తావులేకుండా అర్హులైన పేదల నుంచి పారదర్శక పద్ధతిలో డ్రా/లక్కీడిప్ ద్వారా ఇళ్ల కేటాయింపు చేపడతామని తెలిపారు. ఇల్లు మంజూరు కాని దరఖాస్తుదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారు చెల్లించిన ఈఎండీ మొత్తాన్ని వెంటనే తిరిగి చెల్లిస్తామని చెప్పారు. టవర్స్ నిర్మాణ పనులను ప్రణాళికాబద్ధంగా, వేగంగా పూర్తి చేసి వచ్చే ఏడాది బోనాల పండుగ సమయానికి ఎంపికైన లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. శంకుస్థాపన నుంచి నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రతి దశను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. గత ప్రభుత్వాల హయాంలో పేదలకు ఇళ్ల విషయంలో హామీలు మాత్రమే మిగిలాయని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మాత్రం హామీలను కార్యరూపంలోకి తీసుకొచ్చి పేదల ఇంటి తలుపు తట్టేలా గృహ నిర్మాణ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తోందని మంత్రి తెలిపారు.

# మాజీ జడ్జి యశ్వంత్ వర్మ దోషి

- **లోక్‌సభ ప్యానల్ విచారణలో సంచలన విషయాలు వెల్లడి**

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 12, సిరి న్యూస్ :**



ఇంట్లో భారీగా నోట్ల కట్టలు లభించిన కేసులో ఢిల్లీ హైకోర్టు మాజీ జడ్జి యశ్వంత్ వర్మ దోషిగా తేలారు. అతడిపై మోపిన అభియోగాలు అన్నీ నిజమేనని లోక్‌సభ ప్యానెల్ నిర్ధరించింది. అయితే, ఈ విషయంలో అతడిపై ఏ చర్యలు తీసుకుంటారనే విషయంలో ఇంకా స్పష్టత లేదు. ఢిల్లీ హైకోర్టు మాజీ జడ్జి, రిటైర్డ్ జస్టిస్ యశ్వంత్ వర్మ ఢిల్లీలోని 30 తుగ్లక్ రోడ్డులోని ప్రభుత్వ భవనాల్లో నివాసం ఉంటున్నాడు. గత ఏడాది మార్చి 1415 తేదీల మధ్య ఇంట్లో అగ్నిప్రమాదం జరగగా అగ్నిమాపక సిబ్బంది వెళ్లి మంటలను ఆర్పారు. ఈ ఘటనకు సంబంధించి అప్పట్లో కొన్ని ఫొటోలు బయటపడ్డాయి. యశ్వంత్ వర్మ ఇంట్లో భారీగా నోట్ల కట్టలున్నాయి. ఇంటి స్టోర్ రూమ్‌లో ఈ నోట్ల కట్టలు చాలావరకు కాలిపోయాయి. కొన్ని ధ్వంసమయ్యాయి. అవన్నీ రూ.500 నోట్ల కట్టలే. ఈ అంశం వివాదాస్పదం కావడంతో పోలీసులు, ఇతర అధికారులు ఆ ఇంటికి వెళ్లి ఆ ప్రదేశాన్ని సీజ్ చేశారు. అప్పటికే ఇంట్లోని సాక్ష్యాలు తారుమారయ్యాయి. ఫొటోల్లో కనిపించిన కరెన్సీ నోట్లు ఆ సమయానికి అక్కడ లేవు. మొదట ఈ నోట్ల కట్టలకు, తనకు సంబంధం లేదని యశ్వంత్ వర్మ చెప్పాడు. ఒక రిటైర్డ్ జడ్జి ఇంట్లో భారీగా నోట్ల కట్టలు కనిపించడం సంచలనంగా మారింది. జడ్జిల అవినీతి అంశం తెరదకు వచ్చింది. దీంతో ఈ అంశంపై పెద్ద దుమారం రేగింది. చివరకు దీనిపై పార్లమెంట్ స్పందించింది. ఈ అంశంపై విచారణ జరిపేందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఒక ప్యానెల్ ఏర్పాటు చేశారు. ఈ ప్యానెల్ విచారణ జరిపింది. ఈ విచారణ తర్వాత అతడిని దోషిగా గుర్తించింది. ఇందుకు ప్రధాన కారణాలు ఇవి. ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది.. అది ఎవరిది.. ఆ డబ్బు ఎంత ఉంటుంది.. వంటి వివరాలపై యశ్వంత్ వర్మ సరైన సమాధానం చెప్పలేకపోయారు. ఆ డబ్బు ఎక్కడినుంచి వచ్చిందో తనకు తెలియదన్నాడు. ఇతరులు తన ఇంటిని అక్రమంగా వాడుకునే అవకాశం ఉందని, ఎవరో తనకు తెలియకుండా డబ్బు తన ఇంట్లో పెట్టారని వర్మ చెప్పాడు. తనపై కుట్ర చేసి ఎవరో ఆ నోట్లు తన ఇంట్లో పెట్టారని చెప్పాడు. అయితే, ఇందుకు తగ్గ సాక్ష్యాల్ని ఆయన చూపించలేకపోయారు. ఆ సమాధానాలు నమ్మలేని విధంగా ఉన్నాయి. విచారణ ప్యానెల్ కూడా ఆ ఇంట్లోకి బయటి వ్యక్తులు వచ్చి,అంత డబ్బు ఉంచినట్లు ఆధారాలు లేవని తేల్చింది. మరోవైపు కాలిపోయిన నోట్లు తర్వాత కనిపించకపోవడంపై కూడా వర్మ సరైన సమాధానం చెప్పలేకపోయారు. దీంతో వర్మను లోక్‌సభ ప్యానెల్ దోషిగా తేల్చింది.

# చర్చకు నెప్పుడూ సిద్ధమే

- **చర్చ లేకుండా చేస్తున్నదే విపక్షం**
- **హోం మంత్రి అమిత్ షా**

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 12, సిరి న్యూస్:**



పార్లమెంట్‌లో చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు అడిగే ప్రతి ప్రశ్నకు సమాధానం ఇస్తానన్నారు. పార్లమెంటు కార్యకలాపాలకు పదేపదే అడ్డంకులు ఏర్పడుతున్న నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. ప్రతిష్టంభనకు తెరదించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అన్ని అంశాలపై చర్చించేందుకు తాను సిద్ధమని స్పష్టం చేశారు. అయితే సభలో చర్చ జరగాలా.. ఆందోళన కొనసాగాలా అనేది ప్రతిపక్షమే నిర్ణయించుకోవాలన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలనుంచి గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు.. 24 గంటల పాటు ప్రతిపక్షాలు ప్రశ్నలు అడగడానికి అందుబాటులో ఉంటానని చెప్పారు. చర్చ జరపాలని ప్రతిపక్షాలు అధికారికంగా లేఖ రాస్తే.. చర్చ జరపడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. బుధవారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో అమిత్ షా మీడియాతో మాట్లాడుతూ.. 'సమావేశాలు మొదలైన నాటినుంచి పార్లమెంట్‌కు వస్తున్నాను. నా ఛాంబర్‌లో కూర్చుంటున్నాను. పార్లమెంట్ కార్యక్రమాలు సజావుగా జరగకుండా ప్రతిపక్షాలు అడ్డుకుంటుంటే.. ఎవరైనా ఏం చేస్తారు?. వాళ్లు చర్చ జరగడానికి అంగీకరించరు. దీన్ని బట్టి ఎవరు పారిపోతున్నారో ప్రజలే అర్థం చేసుకుంటారని అన్నారు. చర్చకు సిద్ధంగా ఉన్న ప్రతిపక్ష ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాయాలని సూచించారు. అలా చేస్తే మధ్యాహ్నం 3 గంటలకు చర్చ ప్రారంభించవచ్చని.. రాత్రి వరకు చర్చ కొనసాగించేందుకు తాను సిద్ధమన్నారు. అవసరమైతే గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు కూడా చర్చను కొనసాగిద్దామని తెలిపారు. ప్రతిపక్షం అడిగే ప్రతి ప్రశ్నకూ సమాధానం ఇస్తానని షా చెప్పారు. పార్లమెంటులో 'కనిపించడం లేదు', 'పారిపోయారు' వంటి పదాలు ఉపయోగించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జి ఘటనపై చర్చకు రావాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ఉద్దేశించి సవాల్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలకు కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కౌంటర్ ఇచ్చారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాపై ప్రశ్నల వర్షం కురిపించారు. 'విద్యార్థులపై లాఠీచార్జ్ ఎవరు చేశారు. కాల్పులకు ఆదేశించింది ఎవరు? 20 రోజులుగా అమిత్‌షా ఎందుకు మాట్లాడలేదు. పార్లమెంట్ ముగిసే సమయానికి అమిత్‌షా డ్రామాలు ఆడుతున్నారు' అంటూ రాహుల్ మండిపడ్డారు.

## విద్యార్థుల ఆందోళనలపై పార్లమెంట్‌లో చర్చకు సిద్ధం

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 12, సిరి న్యూస్:**

దేశవ్యాప్తంగా కలకలం రేపిన నీట్ పరీక్ష వివాదం, అనంతర విద్యార్థుల ఆందోళనలపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఆయన ఒక అధికారిక లేఖ రాశారు. బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఇప్పటికే ప్రభుత్వం తరఫున నీట్ అంశంపై చర్చకు అంగీకారం తెలిపారని అమిత్ షా తన లేఖలో గుర్తుచేశారు. ప్రతిపక్షాలు ఈ అంశాన్ని తీవ్రంగా ఎత్తిచూపడానికి ముందే, ప్రస్తుత సమావేశాల్లోనే 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ వి□న్స్) సవరణ బిల్లు, 2026' పై సుదీర్ఘ చర్చ జరిగిందని లేఖలో హోం మంత్రి ప్రస్తావించారు. అయితే ఆ సమయంలో ప్రతిపక్షానికి చెందిన ఏ ఎంపీ కూడా నీట్ పరీక్షల గురించి మాట్లాడలేదని, అయినప్పటికీ ప్రజా ప్రయోజనాల దృష్ట్యా మరొకసారి ఈ అంశంపై చర్చించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన వివరించారు. నా విజ్ఞప్తి ఏమిటంటే... వి□రు విపక్షాలతో చర్చించి, పరస్పర అంగీకారంతో నేటి నుంచి ఎంత సమయం, ఎన్ని గంటలు సరిపోతాయని భావిస్తే అంత సమయం కేటాయించాల్సిందిగా కోరుతున్నాను. కేటాయించిన ఆ సమయంలో నేను సభలో స్వయంగా ఉండి, ఈ అంశంపై చర్చలో పాల్గొనడానికి, విపక్షాల ప్రశ్నలన్నింటికీ సమాధానమివ్వడానికి సిద్ధంగా ఉన్నాను.' అని అమిత్ షా తన లేఖలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో చర్చలు, సంభాషణల ద్వారానే పరిష్కారాలు లభిస్తాయి.. ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్య వ్యవస్థలపై తనకు అపారమైన విశ్వాసం ఉంది.. అలాగే ఈ సభ చర్చలు, సంభాషణల కోసమే ఉందనేది నా నమ్మకమని అమిత్ షా తన లేఖలో రాశారు. కాబట్టి, విపక్ష నాయకులతో చర్చించి, ఈ ముఖ్యమైన విషయంపై మంచి వాతావరణంలో చర్చ జరిగేలా చూడాలని కోరుతున్నానని అమిత్ షా పేర్కొన్నారు. తద్వారా ఈ అంశంపై అధికార, ప్రతిపక్షాలకు చెందిన గౌరవనీయ సభ్యులందరూ తమ అమ□ల్యమైన అభిప్రాయాలను, ఆలోచనలను సభకు సమర్పించే అవకాశం కలుగుతుందని అమిత్ షా చెప్పారు.

# జంతర్‌మంతర్ సీజన్-2కు సిద్ధం

**న్యూఢిల్లీ, ఆగస్టు 12, సిరి న్యూస్:**



కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే కీలక ప్రకటన చేశారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వేదికగా త్వరలోనే 'జంతర్‌మంతర్ సీజన్2' పేరుతో మరో ఉద్యమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో పలువురు అడుగుతున్న ప్రశ్నలకు స్పందించిన ఆయన.. రెండో విడత ఆందోళనకు సన్నాహాలు జరుగుతున్నాయని వెల్లడించారు. అయితే తేదీలు, ప్రధాన డిమాండ్లు, కార్యాచరణకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో అధికారికంగా ప్రకటిస్తామని చెప్పారు.

**విద్యార్థుల ఉద్యమానికి మద్దతు**

ఉత్తరప్రదేశ్‌లోని హమీర్‌పూర్ జిల్లా కలెక్టరేట్ వద్ద పాఠశాలకు రహదారి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులు చేపట్టిన నిరసనకు దీప్కే మద్దతు తెలిపారు. సుమారు 300 మంది విద్యార్థులు, 100 మంది తల్లిదండ్రులు పాల్గొన్న ఈ ఆందోళనపై స్పందిస్తూ.. కనీస మౌలిక వసతుల కోసం చిన్నారులు రోడ్డెక్కాల్సి రావడం బాధాకరమని పేర్కొన్నారు.

**సమావేశాలను అడ్డుకున్నారంటూ ఆరోపణ**

ఢిల్లీలో సీజేపీ వాలంటీర్ల సమావేశాలను నిర్వహించకుండా అధికార బీజేపీ ఒత్తిళ్లు తెచ్చిందని దీప్కే ఆరోపించారు. సమావేశాల కోసం హాళ్లు ఇవ్వకుండా యజమానులపై ఒత్తిడి తెచ్చారని, చివరకు ఒక హాల్ లభించినప్పటికీ సమావేశం రోజున నిర్వాహకులకు బెదిరింపులు వచ్చాయని పేర్కొన్నారు. ఇలాంటి ఒత్తిళ్లకు తమ పార్టీ భయపడబోదని స్పష్టం చేశారు. యువత సమస్యలపై పోరాటాన్ని కొనసాగిస్తామని, 'జంతర్‌మంతర్ సీజన్2' ద్వారా తదుపరి కార్యాచరణను మరింత విస్తృతంగా చేపట్టనున్నట్లు అభిజీత్ దీప్కే వెల్లడించారు.

## రాజ్యసభలో 'లుంగీవాలా వ్యాఖ్యలు' కలకలం

- **బీజేపీ ఎంపీ సుష్మితా దేవ్ వ్యాఖ్యలపై ఎంపీ జాన్ బ్రిట్టాస్ ఆగ్రహం**

**న్యూఢిల్లీ,ఆగస్ట్12, సిరి న్యూస్:**

రాజ్యసభలో 'లుంగీవాలా వ్యాఖ్యలు' కలకలానికి దారి తీశాయి. బీజేపీ ఎంపీ సుష్మితా దేవ్ తనను లుంగీవాలా అంటూ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని సీపీఐ (ఎమ్) ఎంపీ జాన్ బ్రిట్టాస్ ఆరోపించారు. ఆమె వ్యాఖ్యలను ఖండిస్తూ తీర్మానాన్ని కూడా ప్రవేశపెట్టారు. దక్షిణాది వ్యక్తిగా తన ఆహార్యం తనకు ఎంతో గర్వకారణమని ఎంపీ జాన్ బ్రిట్టాస్ తెలిపారు. పార్లమెంటు వేదికగా కించపరిచే వ్యాఖ్యలు చేయడం విచారకరమని అన్నారు. 'ఇటీవల ఓ రోజు నేను సభలో మాట్లాడుతుంటే ఆమె లుంగీవాలా అంటూ నన్ను ఉద్దేశించి అమర్యాదకర వ్యాఖ్యలు చేశారు. నేను ధోతీతో ఉన్నా. మలయాళీని, దక్షిణాది వ్యక్తిని అయినందుకు గర్వపడుతున్నా. అయితే, అవమానకర వ్యాఖ్యలు చేయడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు. ఈ విషయంపై సభ దృష్టిసారించాలి. ఆమెకు వ్యతిరేకంగా ప్రివిలెజ్ మోషన్‌ను ప్రవేశపెట్టాను' అని తెలిపారు. తన బాధ్యతలు నిర్వర్తించనీయకుండా ఎంపీ దేవ్ పదే పదే అడ్డుపడ్డారని ఎంపీ బ్రిటాస్ ఆరోపించారు. పలు మార్లు లుంగీవాలా అని అన్నారని ఆరోపించారు. ఈ వార్తలపై రాజ్యసభలో జేపీ నడ్డా మాట్లాడుతూ లుంగీ కామెంట్‌స్‌ను తాము సమర్థించమని స్పష్టం చేశారు. బ్రిట్టాస్ అభ్యంతరాలు, వ్యాఖ్యలు అన్నీ రికార్డుల్లోకి చేరాయని అన్నారు. తమ దృష్టిలో అది ధోతీ అని కూడా చెప్పారు. సభ హుందాతనాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు కూడా అభిప్రాయపడ్డారు.





## షార్ట్‌కట్ కోసం వెంపర్లాడితే నష్టపోతాం

- **అర్థవంతమైన మార్గంలో సాగితేనే మంచిది**
- **జెన్‌జిలకు మోదీ పరోక్ష హెచ్చరికలు**

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 12, సిరి న్యూస్:**

ప్రధాని నరేంద్ర మోదీ జెన్‌జీ యువతకు కీలక సూచన చేశారు. షార్ట్‌కట్ కోసం వెంపర్లాడితే నష్టపోయే ప్రమాదమే ఎక్కువని ప్రధాని హెచ్చరించారు. జీవితంలో ముందుకుసాగే క్రమంలో అర్థవంతమైన మార్గాలను ఎంచుకోవాలని హితవు పలికారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆత్మకథ పుస్తకం విడుదల సందర్భంగా ఆయన మాట్లాడారు. కొందరు వ్యక్తులు వేగంగా గమ్యాన్ని చేరుకునేందుకు ఫుట్‌బ్రిడ్జ్‌లను వాడకుండా రైల్వే ట్రాక్‌లను దాటుతుంటారని మోదీ గుర్తుచేశారు. అలాంటి వారికోసమే రైల్వే స్టేషన్లలో బోర్డులపై ప్రదర్శించే హెచ్చరికలు జీవిత పాఠాలను నేర్పుతాయన్నారు. మన ఆలోచనలపై ప్రభావం చూపించే ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలి. మీరు ముందుకు వెళ్లే మార్గం కావాలనుకుంటే.. మీరు ఆరాధించే వ్యక్తుల ఆత్మకథ చదవండని సూచించారు. ఇటీవల కాలంలో మోదీ జెన్‌జీ యువతతో కనెక్ట్ అయ్యేలా తన సోషల్ డియా యాక్టివిటీలో మార్పులు చేసుకుంటున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో సెల్ఫీ వీడియోలను పోస్టు చేస్తున్నారు. యువత వాడే భాషను ఉపయోగిస్తున్నారు. అదే సమయంలో రీల్స్‌కే పరిమితం కాకుండా కెరీర్‌పైనా దృష్టిపెట్టాలని సూచించారు. ఇదిలా ఉంటే.. కోవింద్ రాసిన పుస్తకావిష్కరణ కార్యక్రమం ఢిల్లీలో జరిగింది.

# మీరు మారిపోయారు.. మోదీతో ఖర్గే

- **సుప్రియా సూలె కూతురు వివాహ రిసిప్షన్‌లో సరదా సన్నివేశం**

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 12 , సిరి న్యూస్:**



రాజకీయ విభేదాలు పక్కనపెట్టి నేతలు సరదాగా మాట్లాడుకున్న దృశ్యం ఓ వివాహ వేడుకలో కనిపించింది. ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మధ్య జరిగిన చిన్నపాటి సంభాషణ నవ్వులు పూయించింది. ఢిల్లీలో ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే కుమార్తె వివాహ రిసెప్షన్‌లో ఈ సరదా సన్నివేశం చోటుచేసుకుంది. రిసెప్షన్‌కు రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ, ఖర్గే తదితరులు హాజరయ్యారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వద్దకు వెళ్లి కరచాలనం చేశారు. అనంతరం ప్రియాంకను పలకరించిన మోదీ.. ప్రియాంకా జీ ఎలా ఉన్నారు? అని అడగగా.. బాగున్నాను... రెలా ఉన్నారు? అంటూ ఆమె బదులిచ్చారు. నేను అలాగే ఉన్నాను అని మోదీ నవ్వుతూ అన్నారు. వెంటనే అక్కడే ఉన్న ఖర్గే కల్పించుకుని.. 'అలా ఏ లేదు మీరు కొంచెం మారిపోయారు' అంటూ సరదాగా చమత్కరించారు. దీంతో మోదీ నవ్వుతూ ఖర్గే భుజంపై తట్టారు. ఇద్దరూ సరదాగా చేతులు కలుపుతూ నవ్వుకున్నారు. సుప్రియా సూలే కుమార్తె రేవతి వివాహం నాగ్‌పూర్‌కు చెందిన పారిశ్రామికవేత్త సరంగ్ లఖానీతో జూన్‌లో ముంబైలో జరిగింది. ఢిల్లీలోని 6, జనపథ్‌లో సోమవారం రాత్రి ఘనంగా రిసెప్షన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ పార్టీలకు చెందిన పలువురు ప్రముఖ నేతలు హాజరయ్యారు.

# 11.56 లక్షల ఇళ్లు కేటాయించండి

- **కేంద్ర మంత్రి చౌహాన్‌కు మంత్రి పొంగులేటి వినతి**
- **తెలంగాణలో పర్యటించాల్సిందిగా ఆహ్వానం**
- **సానుకూలంగా స్పందించిన శివరాజ్ సింగ్**

**న్యూఢిల్లీ, ఆగస్టు 12, సిరి న్యూస్ :**



ప్రధానమంత్రి ఆవాస్ యోజనగ్రామీణ్ (పీఎంఏవై జి 2.0) కింద రాష్ట్రానికి సమగ్ర ప్రాతిపదికన ఒకేసారి 11,56,915 ఇళ్లను కేటాయించాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఢిల్లీలో కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను పొంగులేటి బుధవారం కలిసి ఈమేరకు వినతిపత్రాన్ని అందజేశారు. గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాసిన లేఖను ఈ సందర్భంగా గుర్తు చేసిన ఆయన రాష్ట్రంలో ఇళ్ల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

**ఏడాది క్రితమే సర్వే పూర్తి.. మంజూరులోనే జాప్యం**

రాష్ట్రవ్యాప్తంగా 'ఆవాస్ ప్లస్2024' యాప్ ద్వారా అత్యంత పారదర్శకంగా ఇంటింటి సర్వే నిర్వహించామని మంత్రి పొంగులేటి వివరించారు. ఈ సర్వేలో 11.56 లక్షలకుపైగా గ్రామీణ పేద కుటుంబాలు ఇళ్లకు అర్హులుగా తేలాయని తెలిపారు. వీటికి సంబంధించి సూపర్ చెక్, అనర్హుల తొలగింపు ప్రక్రియలన్నీ ఏడాది క్రితమే పూర్తయినప్పటికీ కేంద్రం నుంచి లక్ష్యాల ప్రకటనలో జాప్యం జరుగుతోందన్నారు. తెలంగాణలో పన్నెండేళ్లుగా పేదలకు ఇళ్ల నిర్మాణం నిలిచిపోయి తీవ్రమైన డిమాండ్ పేరుకుపోయినందున ఒకేసారి ఈ ఇళ్లన్నింటినీ మంజూరు చేయాలని కోరారు.

**ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం**

పీఎంఏవైజి కింద ఇచ్చే కేంద్ర వాటా, సాధారణ రాష్ట్ర వాటాతో సంబంధం లేకుండా ప్రతి పేద కుటుంబం ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని పొంగులేటి వెల్లడించారు. ఇందుకు అవసరమైన నిధులను ఇప్పటికే రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించినట్లు స్పష్టం చేశారు.

**తెలంగాణ పర్యటనకు రావలసిందిగా ఆహ్వానం**

శివరాజ్ సింగ్ చౌహాన్‌ను తెలంగాణలో పర్యటించాల్సిందిగా పొంగులేటి ఆహ్వానించారు. రాష్ట్రానికి వచ్చి పీఎంఏవైజి 2.0 కింద ఇళ్ల కేటాయింపును స్వయంగా ప్రకటిస్తే గ్రామీణ పేదలకు కొండంత అండగా నిలుస్తుందని, అది చరిత్రాత్మక ఘట్టంగా మారుతుందని అన్నారు. మంత్రి పొంగులేటి విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తూ రాష్ట్రంలో పర్యటించేందుకు అంగీకరించారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, సురేష్ షెట్కార్, రామసహాయం రఘురాం రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్‌తోపాటు తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వి,పి.గౌతమ్ తదితరులు ఉన్నారు.

## కంకోల్ ఫ్లైఓవర్ పై గుర్తుతెలియని వ్యక్తి మృతి



**మునిపల్లి, ఆగస్టు 12 (సిరి న్యూస్):**

మునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కంకోల్ ఫ్లైఓవర్ బ్రిడ్జిపై బుధవారం తెల్లవారు జామున గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో సుమారు 35–40 ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదు. మృతుడి శరీరంపై రామ్ దాస్ భగవాన్ అనే పచ్చబొట్టు ఉండటంతో పాటు చేతికి వాచ్, తాయెత్తు, పూసల దారం ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలంలో పాత దుప్పటి కూడా లభించింది. ఈ వివరాల ఆధారంగా మృతుడిని ఎవరైనా గుర్తిస్తే, లేదా తమ కుటుంబ సభ్యుడు, బంధువు ఇటీవల కని పించకుండా పోయినట్లు తెలిసినా వెంటనే మునిపల్లి పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు. మృతుడి గుర్తింపునకు ప్రజలు ఈ సమాచారాన్ని సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా షేర్ చేసి పోలీసులకు సహక రించాలని విజ్ఞప్తి చేశారు.

## వీరభద్రస్వామి ఆలయంలో వైభవంగా రుద్రహోమం

### ప్రతి అమావాస్యకు రుద్రహోమం,



**గుమ్మడిదల, ఆగస్టు 12 (సిరి న్యూస్):**

అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలోని భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో బుధవారం రుద్రహోమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని హోమగుండంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య రుద్రహోమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. హిందూ సంప్రదాయంలో రుద్రహోమానికి విశిష్టమైన స్థానం ఉందని, ఇది దుష్టశక్తుల నివారణతో పాటు మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తుందని అర్చకులు తెలిపారు. హోమ కార్యక్రమం అనంతరం పూర్ణాహుతి నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. వేదఘోషలు, శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగింది. ఆలయంలో ప్రతి అమావాస్య రోజున రుద్రహోమం, ప్రతి పౌర్ణమి సందర్భంగా చండీహోమాన్ని క్రమం నిర్వహిస్తున్నారు ఈ హోమాలలో పాల్గొని ప్రత్యేక పూజలు చేయించుకోవాలనుకునే భక్తులు ఆలయ అధికారులను సంప్రదించాలని సూచించారు. అమావాస్య సందర్భంగా నిర్వహించిన రుద్రహోమం ద్వారా భక్తులకు శాంతి, సౌభాగ్యం, ఆరోగ్యం, ఆయురారోగ్యాలు కలుగుతాయని అర్చకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లై కమిటీ మాజీ చైర్మన్ మద్ది ప్రతాప్ రెడ్డి, ఆలయ సిబ్బంది సోమయ్య, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## హర్ ఘర్ తిరంగా నినాదంతో విద్యార్థుల దేశభక్తి ర్యాలీ

### గుమ్మడిదల మున్సిపాలిటీ కన్వీనర్, కౌన్సిలర్ రాజిరెడ్డి



**గుమ్మడిదల, ఆగస్టు 12( సిరి న్యూస్):**

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం చేపట్టిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులతో మున్సిపాలిటీ కన్వీనర్ నర్సంపల్లి రాజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు చింతల యాదగిరి ఆధ్వర్యంలో దేశభక్తి ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలను చేతబూనిన విద్యార్థులు హర్ ఘర్ తిరంగా, భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేస్తూ మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా ఉత్సాహంగా ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో పట్టణంలో దేశభక్తి వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా గుమ్మడిదల మున్సిపాలిటీ కన్వీనర్, కౌన్సిలర్ రాజిరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ యువత, విద్యార్థుల్లో దేశభక్తి భావాలను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి, జాతీయ ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు చిన్ననాటి నుంచే దేశం పట్ల బాధ్యత, జాతీయ సమైక్యత, దేశభక్తిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ర్యాలీలో ఏఎస్ విద్యా విహార్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఇన్‌చార్జి కొండా లక్ష్మణ్ గుప్తా, కౌన్సిలర్ గిద్దె విజయలక్ష్మి, పలుగు గోవర్ధన్ రెడ్డి, బుచ్చగారి రాంరెడ్డి, గొల్లెనా విజయ్ కుమార్, జైపాల్ రెడ్డి, విజయ్ కుమార్, సాయినేత, శివరాత్రి రాజు, వెంకట్, సృజల్ రెడ్డి, అరవింద్, గణేష్, రాజు తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో బోనాల పండుగ వేడుకలు

**పటాన్ చెరు, ఆగస్టు 12, (సిరి న్యూస్):**





మండల పరిధిలోనీ ఇంద్రేశం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం నాడు ఆషాఢ మాసం బోనాల కార్య క్రమం ఘనంగా నిర్వహించారు. ఈ పాఠశాల చదువుతున్న విద్యార్థులు భక్తి శ్రద్ధలతో పోచమ్మ తల్లికి బంగారు బోనాలు సమర్పించారు. బుధవారం ఉదయం నుంచి విద్యార్థుల ఆనందోత్సాహలతో పోత రాజుల వేషాలతో డప్పు చప్పుళ్ళతో సంతోషంగా పోచమ్మ ఆలయానికి చేరుకొని బోనాలు సమర్పించి భజన కీర్తనలతో అమ్మ వారిని కీర్తించి అమ్మ ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఏనుగు శ్రీనివాస్ రావు మాట్లాడుతూ పిల్లలకు చిన్నప్పటి నుండి మన సంస్కృతి సంప్రదాయాలు, మన పండుగల విశిష్టత తెలియ జేయడం నైతిక విలువలు పాటించడం దీని ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. బోనాలు సమర్పించిన అనంతరం ఊరు , బడిపిల్లలు ఉపాధ్యాయులను చల్లగా చూడమని పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఏనుగు శ్రీనివాస్ రావు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ బండి శాంతి, సత్య నారాయణ,సాయిలు, శారద, రేవతి, లక్మణ్ రావు, సునీత , ఎల్లారెడ్డి, లాస్య, సుధా రాణి, జ్యోతి, పరమేష్ జ్యోతి పాల్గొన్నారు. విద్యార్థులకు బండి శాంతి మధ్యాహ్న భోజనాలు ఏర్పాటు చేశారు.

## యువజన వికాస్ సమితి ఆధ్వర్యంలో ఘనంగా తిరంగా యాత్ర

**పటాన్ చెరు, ఆగస్టు 12, (సిరి న్యూస్)**




స్వాతంత్ర్య దినోత్సవానికి మూడు రోజుల ముందు పటాన్ చెరు పట్టణంలో యువజన వికాస్ సమితి ఆధ్వర్యంలో ఘనంగా తిరంగా యాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో బీఆర్ఎస్ నాయకులు, ఎం డి ఆర్ ఫౌండేషన్ కో–ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. జాతీయ జెండాలను చేతబూని, దేశభక్తి నినాదాలతో సాగిన ఈ యాత్రలో ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, యువత, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. దేశ ఐక్యత, సమగ్రత, సౌభ్రాతృత్వం, జాతీయ స్ఫూర్తిని చాటుతూ తిరంగా యాత్ర ఉత్సాహ భరిత వాతావరణంలో కొనసాగింది. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాలను భావి తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థులు, యువతే దేశ భవిష్యత్తుకు మార్గదర్శకులు అని పేర్కొంటూ, వారిలో దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, జాతీయ స్ఫూర్తిని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడటంలో యువత కీలక పాత్ర పోషించాలని, దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తిం చాలని పిలుపు నిచ్చారు. ఈ కార్య క్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# దేశ భవిష్యత్తు యువత చేతిలో





- **మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి**
- **పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**
- **పటాన్ చెరు లో ఘనంగా తిరంగా యాత్ర**

**పటాన్ చెరు, ఆగస్టు 12, (సిరి న్యూస్):**

దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, యువత శక్తిని సక్రమమైన మార్గంలో వినియోగించి నప్పుడే దేశం మరింత అభివృద్ధి సాధిస్తుందని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మాదక ద్రవ్యాల మహమ్మారి యువత భవిష్యత్తును నాశనం చేస్తోందని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా భాగస్వాములు కావాలని ఆయన పిలుపు నిచ్చారు. దేశభక్తి, జాతీయ సమైక్యత, యువతలో చైతన్యం పెంపొందించే లక్ష్యంతో యువజన వికాస సమితి ఆధ్వర్యంలో పటాన్ చెరు పట్టణంలోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన తిరంగా యాత్ర కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. జాతీయ జెండాలను చేతబూని పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువత, ప్రజలు ఉత్సాహంగా యాత్రలో పాల్గొన్నారు. దేశభక్తి నినాదాలతో పటాన్ చెరు వీధులు మార్మోగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత నేటి యువతపై ఉందన్నారు. విద్య, క్రీడలు, విజ్ఞానం, సాంకేతిక రంగాల్లో యువత రాణిస్తూ దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని సూచించారు.

**మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి**

డ్రగ్స్ యువత జీవితాలను చిన్నాభిన్నం చేయడంతో పాటు కుటుంబాలను, సమాజాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తం చేశారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్యం, విద్య, ఉపాధి అవకాశాలు దెబ్బ తింటాయని, నేర ప్రవృత్తి పెరిగే ప్రమాదం ఉందన్నారు. యువత డ్రగ్స్ కు దూరంగా ఉండి తమ జీవితాలను ఉన్నత లక్ష్యాల వైపు మలుచు కోవాలని సూచించారు. డ్రగ్స్ నియంత్రణ కేవలం ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత మాత్రమే కాదని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, పోలీసు శాఖతో పాటు ప్రతి పౌరుడు బాధ్యత తీసు కోవాల్సిన అవసరం ఉందని అన్నారు. అను మానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించి డ్రగ్స్ నిర్మూలనకు సహకరిం చాలని కోరారు. దేశభక్తితో పాటు సామాజిక బాధ్యత అవసరం అని అన్నారు. తిరంగా యాత్ర వంటి కార్యక్రమాలు యువతలో దేశభక్తిని పెంపొందించడంతో పాటు సామాజిక బాధ్యతను గుర్తు చేస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దేశ అభివృద్ధికి యువతే ప్రధాన శక్తి అని, ఆరో గ్యకరమైన, క్రమశిక్షణతో కూడిన, మాదక ద్రవ్యాలకు దూరమైన యువత తోనే బలమైన భారతదేశాన్ని నిర్మించ గలమని అన్నారు. కార్యక్రమాన్ని నిర్వహించిన యువజన వికాస సమితి ప్రతినిధులను అభి నందించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, సీనియర్ నాయకులు నర్రా బిక్షపతి, వెంకటేష్, బల్వంత్, హమీద్, ధనరాజ్, షకీల్, కొండల్, టింకు, యువజన వికాస సమితి అధ్యక్షులు విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి విజయ్ గౌడ్, యువత, విద్యార్థులు, వివిధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అనుభవపూర్వక అభ్యాసానికి గీతం పెద్దపీట

- **ఆటో డెస్క్ ఫ్యూజన్ ఇన్ సైడర్ కార్యక్రమం ఏర్పాటు**
- **చురుకుగా పాల్గొన్న విద్యార్థులు.**

**పటాన్ చెరు, ఆగస్టు 12, (సిరి న్యూస్):**




వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇంజనీరింగ్, సాంకేతిక రంగాలలో రాణించడానికి అవసరమైన పరిశ్రమతో అనుబంధం, అనుభవ పూర్వక అభ్యాసాలకు హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా, గీతం స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ లోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఒకరోజు 'ఆటోడెస్క్ ఫ్యూజన్ ఇన్ సైడర్' పేరిట నైపుణ్య పెంపుదల కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించింది. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై ప్రత్యక్ష అనుభవాన్ని పొందడానికి, ఉత్పత్తి రూపకల్పన, ఇంజనీరింగ్ లోని తాజా పరిణామాలను అర్థం చేసుకోవడానికి ఇది ఒక అవకాశాన్ని కల్పించింది. క్వాలిటీ అస్యూరెన్స్ మేనేజర్ సుజయ్ డిసౌజా నేతృత్వంలోని ఆటోడెస్క్ పరిశ్రమ నిపుణులతో కూడిన ఎనిమిది మంది బృందం, విద్యార్థులతో సంభాషించి, అభివృద్ధి చెందుతున్న ఇంజనీరింగ్, ఉత్పత్తి–అభివృద్ధి రంగంపై విలువైన అంతర్దృష్టులను పంచుకున్నారు. కొత్త ఆటోడెస్క్ ఉత్పత్తుల పరీక్ష, అనువర్తనాన్ని కూడా ప్రదర్శించి, విద్యార్థులకు అధునాతన రూపకల్పన, ఇంజనీరింగ్ సాధనాలపై ప్రత్యక్ష అనుభవాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా, విద్యార్థులకు మూడు వారాల వ్యవధిలో పూర్తి చేయడానికి రూపకల్పన, అనుకరణ, సాంకేతిక చిత్రలేఖనం, చిత్రీకరణ (design, simulation, technical drawing and rendering)తో కూడిన డిజైన్ సవాళ్లు ఇచ్చారు. అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన ప్రాజెక్టు బృందాలు, వ్యక్తిగత ప్రతిభావంతులను వారి పనితీరు, ప్రాజెక్టు ఫలితాల ఆధారంగా అవార్డులతో సత్కరించనున్నారు. విద్యార్థులు, నిజ జీవిత సవాళ్లను పరిష్కరించడానికి ఇంజనీరింగ్ పరిజ్ఞానం, డిజైన్ థింకింగ్, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల ను ఎలా అన్వయించగలరో ప్రదర్శిస్తూ, బరువును మోయగలిగే ఎక్సోస్కెలిటన్, స్వయం ప్రతిపత్తి తో పనిచేసే నదీ శుభ్రత రోబోట్ వంటి వినూత్న ఉత్పత్తి–అభివృద్ధి భావనలను కూడా ప్రదర్శించారు. కోర్ ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ రమేష్ వడ్డి, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ జయ ప్రకాష్ శ్రీవాస్తవ, ఆటోడెస్క్ ప్రతినిధులకు స్వాగతం పలికి, వారిని సత్కరించారు. ఇంజనీరింగ్ వృత్తిలో మారుతున్న అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేయడంలో పరిశ్రమ–విద్యాసంస్థల సహకారం ప్రాముఖ్యతను వారు నొక్కి చెప్పారు. ఈ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులను ప్రోత్సహించారు. అధ్యాపకుడు డాక్టర్ వీరప్రతాప్ ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు చురుకుగా పాల్గొని, ఆటోడెస్క్ నిపుణులతో అర్థవంతమైన చర్చలలో నిమగ్నమయ్యారు. విద్యార్థులు ఉత్సాహంగా ప్రశ్నలడిగి, తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. విద్యార్థులు తమ సాంకేతిక నైపుణ్యాలను బలోపేతం చేసుకోవడానికి, పరిశ్రమ పోకడలను అన్వేషించడానికి, అధునాతన ఇంజనీరింగ్ సాంకేతికతల ఆచరణాత్మక అనువర్తనాలను అర్థం చేసుకోవడానికి ఈ కార్యక్రమం ఒక సుసంపన్నమైన వేదికను అందించింది.

# క్రీడా ప్రాంగణాలు.. కలుపు క్షేత్రాలు..!..

- మంచిర్యాల జిల్లాలో 344 క్రీడా మైదానాలు...పిచ్చిమొక్కల చెరలో.!..
- కోట్ల నిధులు ఖర్చు... పర్యవేక్షణ జీరో.!..
- జిల్లా యంత్రాంగం మౌనం... క్రీడాభిమానుల ఆగ్రహం..
- ప్రారంభోత్సవాలకే నేతలు... నిర్వహణకు ఎవరు.?..
- పునరుద్ధరణకు సీఎం జోక్యం కావాలన్న డిమాండ్..

**మంచిర్యాల,జిల్లా ప్రతినిధి ఆగస్టు 12 (సిరి న్యూస్)**

తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయాలన్న సంకల్పంతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా వందలాది పల్లె ప్రకృతి క్రీడా ప్రాంగణాలు నిర్మించింది. మంచిర్యాల జిల్లాలోని 18 మండలాల పరిధిలో ఏకంగా 344 క్రీడా ప్రాంగణాలు ఏర్పాటయ్యాయి. కానీ నిర్మాణం జరిగిన కొద్ది కాలానికే ఈ మైదానాలు నిర్వహణ లేక పిచ్చిమొక్కల పాలయ్యాయి. దీనిపై జిల్లా యంత్రాంగం వ్యవహారశైలిపై క్రీడాభిమానుల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

**పర్యవేక్షణ బాధ్యత ఎవరిది? జిల్లా యంత్రాంగం మౌనం ఎందుకు.?..**

క్రీడా మైదానాల ఎంపిక, నిర్వహణ బాధ్యతలు గ్రామీణ, మున్సిపల్ శాఖలకు అప్పగించి, జిల్లా పరిపాలన యంత్రాంగం చేతులు దులుపుకుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. క్రీడాశాఖ, విద్యాశాఖలకు ఏమాత్రం ప్రాతినిధ్యం ఇవ్వకుండా, కేవలం ఖాళీ స్థలం కనిపించిన చోటల్లా బోర్డులు తగిలించే పనికి పరిమితమైన తీరుపై స్థానికులు మండిపడుతున్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ఈ ప్రాంగణాల పురోగతిపై ఇప్పటివరకూ ఒక్కసారి కూడా క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టిన దాఖలాలు లేవన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. క్రీడల పేరుతో మంజూరైన నిధులు, మైదానాల నిర్మాణం తర్వాత ఎలాంటి సమీక్షకు నోచుకోకపోవడంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు.






**లక్షలు కుమ్మరించి... నిర్వహణలో నిర్లక్ష్యం!..**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల నుంచి గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో మైదానానికి 50 వేల నుంచి రెండు లక్షల 60 వేల వరకు, మున్సిపాలిటీల పరిధిలో ఒక్కో మైదానానికి 6 లక్షల రూపాయల వరకు ఖర్చు చేశారు. జిల్లా వ్యాప్తంగా 344 మైదానాలకు కలిపి చూస్తే ఇది కోట్ల రూపాయల ప్రజాధనం. ఇంత భారీ మొత్తం వెచ్చించిన తర్వాత కూడా, ఈ నిధులు సద్వినియోగమయ్యాయో లేదో సమీక్షించే యంత్రాంగం లేకపోవడంపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిధులు మంజూరు చేయడం వరకే యంత్రాంగం బాధ్యత అనుకుంటున్నారా? అని క్రీడాభిమానులు ప్రశ్నిస్తున్నారు.

**మెరికలను తీర్చిదిద్దాల్సిన మైదానాలు... పిచ్చిమొక్కల నిలయంగా మార్పు!..**

సరైన నిర్వహణ కొరత, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా జిల్లాలోని అనేక క్రీడా మైదానాలు వినియోగానికి నోచుకోకుండా మూలనపడ్డాయి. కోట్ల రూపాయల విలువైన క్రీడా పరికరాలు తుప్పు పట్టిపోతుండగా, మైదానాలు పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. గ్రామస్థాయి యంత్రాంగం, జిల్లా కేంద్ర పర్యవేక్షణ మధ్య సమన్వయ లోపమే ఈ దుస్థితికి కారణమన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**స్థానిక రాజకీయ నాయకుల పాత్ర ఏది? వారి బాధ్యత ఎక్కడ?..**

క్రీడా మైదానాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడంలో ముందుండే స్థానిక రాజకీయ నాయకులు, నిర్వహణ విషయంలో మాత్రం పూర్తిగా మౌనం వహిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండల, జిల్లా స్థాయిలో ప్రజాప్రతినిధులుగా ఉన్నవారు తమ నియోజకవర్గాల్లోని మైదానాల పరిస్థితిపై ఇప్పటి వరకూ ఎలాంటి సమీక్ష చేపట్టలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రారంభోత్సవాల సమయంలో ఫోటోలకు, ప్రచారానికి మాత్రమే పరిమితమైన నేతలు, ఆ తర్వాత మైదానాల బాగోగులు పట్టించుకోవడం లేదన్న ఆగ్రహం క్రీడాభిమానుల్లో వ్యక్తమవుతోంది. నిధులు మంజూరు చేయించిన ఘనత తీసుకున్నప్పుడు, నిర్వహణ వైఫల్యానికి కూడా జవాబుదారీగా ఉండాలని, స్థానిక రాజకీయ నాయకులు కూడా ఈ వ్యవహారంపై బాధ్యత వహించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

**క్రీడాభిమానుల ఆగ్రహావేశం... జవాబుదారీతనం ఎక్కడ.?..**

జిల్లా యంత్రాంగం, స్థానిక రాజకీయ నాయకుల తీరుపై క్రీడాభిమానులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజాధనంతో నిర్మించిన మైదానాలు నిరుపయోగంగా మారుతున్నా, బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. జిల్లా యంత్రాంగం తక్షణమే క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి, నిరుపయోగంగా మారిన మైదానాలను గుర్తించి పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని, అదే సమయంలో స్థానిక ప్రజాప్రతినిధులు కూడా తమ నియోజకవర్గాల్లోని మైదానాల పరిస్థితిపై బహిరంగంగా జవాబు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. క్రీడాభిమాని అయిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఈ అంశంపై స్వయంగా జోక్యం చేసుకుని, జిల్లా యంత్రాంగంతో పాటు స్థానిక నాయకులపై కూడా జవాబుదారీతనం పెంచాలని పలువురు కోరుతున్నారు..

# మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

**కానుకుంట-1లో గ్రామ సంఘం సమావేశం**

**గుమ్మడిదల ఆగస్టు 12 (సిరి న్యూస్ ):**

ప్రతి మహిళ వ్యక్తిగతంగా పొదుపు చేయడంతో పాటు కుటుంబ ఆర్థిక భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని గుమ్మడిదల ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ రాఘవేంద్ర సూచించారు. గ్రామ సంఘం అధ్యక్షురాలు పూజ ఆధ్వర్యంలో కానుకుంట-1 గ్రామ సంఘం సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల ప్రతినిధులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో వ్యక్తిగత పొదుపు ఆవశ్యకత, బ్యాంకింగ్ సేవలు, బీమా పథకాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ రాఘవేంద్ర మాట్లాడుతూ ప్రతి మహిళ వ్యక్తిగతంగా పొదుపు చేయడంతో పాటు కుటుంబ ఆర్థిక భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన వంటి బీమా పథకాలను ప్రతి సభ్యురాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తాము బీమా చేసుకోవడంతో పాటు తమ కుటుంబ సభ్యులకు కూడా బీమా సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు పొదుపు, బీమా, బ్యాంకింగ్ సేవలపై అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమని సమావేశంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సంఘం పాలకవర్గం సభ్యులు, ఏపీఎం నరేందర్, సీసీ వరలక్ష్మి, వీఓఏ కల్పనతో పాటు మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.




# పంట పండించిన రైతుపైనే తైబజార్ భారం?

- సంతలో కూరగాయలు అమ్మడం నేరమా
- సన్నకారు రైతులు, చిరు వ్యాపారుల జీవనోపాధిపై ప్రభావం
- తైబజార్ వేలంపాటతో సన్నకారు రైతులు, చిరు వ్యాపారులపై అదనపు భారం
- కష్టపడి పండించిన కూరగాయలను అమ్ముకున్నా వసూలు చేయడం ఎంతవరకు సమంజసం?
- తైబజార్ విధానంపై పునరాలోచించాలని మున్సిపల్ అధికారులకు రైతులు, వ్యాపారుల విజ్ఞప్తి

**గుమ్మడిదల, ఆగస్టు 12 (సిరి న్యూస్):**

కష్టపడి పంట పండించాం కనీసం దాన్ని అమ్ముకునే స్వేచ్ఛ కూడా లేదా? అంటూ సన్నకారు రైతులు, చిరు కూరగాయల వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ వ్యవసాయ భూముల్లో కూరగాయలు సాగు చేసుకుని, వాటిని వారాంతపు సంతల్లో విక్రయిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్న తమపై తైబజార్ వేలంపాట పేరుతో అదనపు భారం మోపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని గుమ్మడిదల, అన్నారం, బొంతపల్లి తదితర ప్రాంతాల్లో జరిగే వారాంతపు సంతలకు స్థానికంగా కూరగాయలు పండించే సన్నకారు రైతులతో పాటు చిరు వ్యాపారులు కూరగాయలను తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. పంటను పండించేందుకు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, సాగు ఖర్చులు, కూలీల ఖర్చులు భరిస్తూ చివరకు వచ్చిన కొద్దిపాటి ఆదాయంతోనే కుటుంబాలను నెట్టుకొస్తున్నామని రైతులు చెబుతున్నారు. వారాంతపు సంతలో తైబజార్ వేలంపాట నిర్వహించి కాంట్రాక్టర్‌కు



అప్పగించడం వల్ల తమ నుంచి రుసుముల పేరుతో డబ్బులు వసూలు చేసే పరిస్థితి ఏర్పడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట పండించిన రైతు తన కూరగాయలను సంతలో అమ్ముకోవడానికి కూడా అదనపు రుసుము చెల్లించాల్సి వస్తే, సాగు ద్వారా రైతుకు మిగిలేది ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

**చిరు వ్యాపారులపై అదనపు భారం**

వారాంతపు సంతల్లో కూరగాయలు విక్రయించే చిరు వ్యాపారుల పరిస్థితి కూడా అంతంతమాత్రంగానే ఉందని వారు చెబుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలు తీసుకువచ్చి సంతల్లో విక్రయించడం ద్వారా వచ్చే ఆదాయం కుటుంబ పోషణకే సరిపోవడం లేదని, తైబజార్ పేరుతో అదనపు రుసుములు చెల్లించాల్సి వస్తే తమపై మరింత ఆర్థిక భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోట్ల రూపాయల వ్యాపారం చేయడం లేదు బతుకుదెరువు కోసం కూరగాయలు అమ్ముకుంటున్నాం అని చిరు వ్యాపారులు పేర్కొంటున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు కష్టపడితే వచ్చే ఆదాయం కుటుంబ అవసరాలకే సరిపోవడం లేదని, దానిలోనూ తైబజార్ రుసుము చెల్లించాల్సి వస్తే తమ జీవనోపాధి మరింత కష్టతరమవుతుందని అంటున్నారు.

**రైతుకు మార్కెట్ సౌకర్యం కల్పించాల్సిందిపోయి**

రైతులు పండించిన కూరగాయలకు స్థానికంగానే మార్కెట్ సౌకర్యం కల్పించి, మధ్యవర్తుల భారం తగ్గించాల్సిన సమయంలో తైబజార్ వేలంపాట ద్వారా రైతులు, చిరు వ్యాపారులపై అదనపు భారం పడే పరిస్థితి ఏర్పడటం పట్ల వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చిన్న రైతులు నేరుగా వినియోగదారులకు పంటను విక్రయించుకోవడం ద్వారా కొంత మెరుగైన ధర పొందే అవకాశం ఉంటుందని, అలాంటి పరిస్థితుల్లో రుసుముల రూపంలో అదనపు భారం మోపడం వల్ల ప్రయోజనం లేకుండా పోతుందని పేర్కొంటున్నారు.

**తైబజార్ విధానంపై పునరాలోచించాలి**

వారాంతపు సంతల తైబజార్ వేలంపాట విధానాన్ని అధికారులు పునఃపరిశీలించాలని సన్నకారు రైతులు, చిరు కూరగాయల వ్యాపారులు కోరుతున్నారు. స్థానికంగా పంటలు పండించే రైతులకు, చిన్న వ్యాపారులకు ప్రత్యేక మినహాయింపు లేదా రాయితీ కల్పించే అంశాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రైతు కష్టానికి గౌరవం దక్కేలా, చిరు వ్యాపారి జీవనోపాధికి భంగం కలగకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి తైబజార్ రుసుముల విషయంలో తగిన నిర్ణయం తీసుకోవాలని వారు కోరుతున్నారు. రైతులు, చిరు వ్యాపారుల సమస్యపై మున్సిపల్ అధికారులు పునరాలోచించి, జీవనోపాధిపై భారం పడకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## పేకాట స్థావరం పై పోలీసుల మెరుపు దాడి. ఎనిమిది మంది అరెస్ట్



**పేట్-బషీరాబాద్.ఆగస్ట్.12(సిరి న్యూస్).**

పేట్-బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని టీన్ పట్టి పేకాట ఆడుతున్న 8 మందిని పేట్-బషీరాబాద్ పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెలితే బుధవారం నాడు పేట్-బషీరాబాద్ పరిధిలోని అపర్ణ సెరినిటీ అపార్ట్‌మెంట్, D-బ్లాక్ ఫ్లాట్ నెం.706లో డబ్బులు పందెంగా పెట్టి పేకాట ఆడుతున్న 8 మందిని పోలీసులు పట్టుకున్నారు. స్థానిక పోలీసులకు నమ్మదగిన సమాచారం మేరకు సంఘటనా స్థలంలో తనిఖీ చేయగా 8 మంది పేకాట ఆడుతూ పట్టుబడ్డారు.పట్టు పడిన వారిలో వనటదుపుల రమేష్.చేగూరి మోహన్. కె. శ్రీనివాస్.కాసాల విక్రమ్ రెడ్డి.ఎస్.శ్రీనివాస్.చ.దేవేందర్ రెడ్డి.గొల్లపల్లి భాస్కర్. ఎస్.రాజు. వీరంతా రియల్ ఎస్టేట్ వ్యాపారస్థులని పోలీసులు నిర్ధారించారు. వీరి వద్ద నుండి రూ.3,28,000/- నగదు, 08 మొబైల్ ఫోన్లు.10 సెట్ల పేకాట కార్డులు మరియు 01 క్యాష్ కౌంటర్ మెషిన్ స్వాధీనం చేసుకున్నారు. వారిని స్వాధీనం చేసుకున్న వస్తువులతో సహా పోలీస్ స్టేషన్‌కు తరలించి చట్ట ప్రకారం తదుపరి చర్యలు చెప్పడతామని పోలీసులు తెలిపారు.అక్రమ పేకాట బెట్టింగ్ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలనిఇలాంటికార్యకలాపాలపై సమాచారంఉంటే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు వారు సూచించారు.

## పోసానిపేట పంచాయతీలో అక్రమ లే అవుట్ లు

**జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు**



**జోగిపేట, ఆగస్టు 12, ( సిరి న్యూస్):**

సంగారెడ్డి జిల్లా అందోలు మండలం పోసానిపేట పంచాయతీ ఫరిధిలోని సర్వే నెం. 255 లో వెలసిన అక్రమ లేఅవుట్ పైన చర్యలు తీసుకోవాలని జోగిపేటకు చెందిన చిట్టి బాబు బుధవారం జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. పట్టణమునకు ఆనుకొని ఉన్న సర్వే నెం. 255 లో అక్రమంగా గ్రామ పంచాయతి నిబందనలకు విరుద్ధంగా ప్లాట్ల విక్రయాలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. సర్వే నెం. 255, విస్తీర్ణము ఎ 2-26 గుంటలు లే అవుట్ లో చూపారని కానీ భూ రికార్డులలో ఎ 2-21 గుంటలు మాత్రమే పులుగు కిష్టయ్య , సి. హెచ్. సుబ్బారెడ్డి పేర్లమీద ఉందని తెలిపారు. సర్వే నెం. 255 లో వెలసిన లేఅవుట్ కు గ్రామ పంచాయతి అనుమతిగాని, డి.టి.సి.పీ అనుమతిగాని లేదని కలెక్టర్ వివరించారు. నిబందల ప్రకారం ఉండవలసిన 10 శాతం మార్టిగేజ్ డీడ్ చేయలేదని, 10శాతం పార్కుకు కేటాయించ లేదన్నారు. నిబంధల ప్రకారం ఉండవలసిన రోడ్లు కూడ వదల లేదని పేర్కొన్నారు. వెంచర్ లో డ్రైనేజి వ్యవస్థ లేదని, నీటి వసతి, ఎలక్ట్రిసిటి సౌకర్యం లేదన్నారు. లే అవుట్లో కొత్తగా నిర్మాణములు చేపట్టడం జరిగిందని నిబంధనలకు విరుద్ధంగా . వాటికి గ్రామ పంచాయతి అనుమతి ఎలా ఇచ్చిందని అన్నారు. ప్లాట్లు రిజిస్ట్రేషన్ ఏ నిబంధనలకు విరుద్ధంగా చేశారన్నారు. ప్లాట్ల యజమానులు నిర్మాణం కోసం అనుమతి తీసుకొన్న ప్రకారం నిర్మాణం చేయకుండ ఇష్టాను సారంగా నిర్మాణము చేపట్టిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకొకపోగా వారికి ఇంటి నంబర్లను కేటాయించారన్నారు. ఈ విషయమై విచారణ జరిపించి, యజమానులపై చర్య తీసుకొని ఇక ముందు ఇట్టిలే అవుట్ లో ఎలాంటి దస్తావేజును రిజిస్ట్రేషన్ కాకుండ, నిర్మాణ అనుమతులు ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను కోరారు.

## తేనెటీగల పెంపకం రైతులకు వరం

- హార్టికల్చర్ తో అధిక లాభాలు.
- జిల్లా హార్టికల్చర్ అధికారిమహేశ్వరి
- రైతులు హార్టికల్చర్ వైపు అడుగులు వేయాలి.



**మెదక్ ఆగష్టు,12(సిరి న్యూస్)**

తేనెటీగలు పెంపకం ద్వారా రైతులు స్వయం సమృద్ధి సాధించి ఆర్థిక లబ్ధి పొందే అవకాశం ఉందని జిల్లా హార్టికల్చర్ అధికారి మహేశ్వరి అన్నారు.బుధవారం సంగారెడ్డి జిల్లా జోగిపేట్ మండలం రామ్సాన్ పల్లి గ్రామ పరిధిలోని వ్యవసాయ క్షేత్రంలో మెదక్ జిల్లా రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. తేనెటీగలను ఎలా పెంచాలి, దానిలో రకాలు, తేనెటీగలకు అవసరమైన పంటల వివరాలను శిక్షకులు పరిపూర్ణ తెలియజేశారు. ఈ సందర్భంగా మహేశ్వరి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ ఆదేశాల మేరకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ప్రతి రైతు తేనెటీగల పెంపకం ద్వారా తమ పంట పొలాల్లో దిగుబడి పెంచుకునే అవకాశం ఉంటుందన్నారు. తేనెటీగలు పాలినేషన్ చేయడం ద్వారా దిగుబడి గణనీయంగా పెడుతుందని తెలిపారు. అంతేకాకుండా తేనెటీగల్ ద్వారా స్వచ్ఛమైన తేనె లభిస్తుందన్నారు. ఒక్క తేనెటీగల డబ్బా ద్వారా నెలకు మూడు కిలోల స్వచ్ఛమైన తేనె లభిస్తుందని,నేడు పూర్తి గా కల్తీయమైన ప్రపంచంలో స్వచ్ఛమైన తేనెకు భారీ డిమాండ్ ఉందన్నారు. తేనెటీగలు పెంచుకోవాలని ఆసక్తిగల రైతులు మెదక్ జిల్లా హార్టికల్చర్ అధికారులను సంప్రదించాలని ఆమె సూచించారు. ఆసక్తికర రైతులు ముందుకు వచ్చినట్లయితే ప్రభుత్వం ద్వారా సబ్సిడీ కూడా పొందవచ్చని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి కీర్తన, మెదక్ జిల్లాకు చెందిన ఓత్సాహిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పటాన్‌చెరు నియోజకవర్గ సలహాదారుగా కాశీపతి ఏకగ్రీవ ఎన్నిక..

**రామచంద్రపురం, ఆగస్టు 12 (సిరి న్యూస్):**



తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టియూడబ్ల్యూజే–ఐజెయూ) పటాన్‌చెరు నియోజకవర్గ సలహాదారుగా కాశీపతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం నిర్వహించిన నియోజకవర్గ విస్తృత సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఏ.కె. ఫైసల్, జిల్లా అధ్యక్షులు యాదగిరి సమక్షంలో జరిగిన సమావేశంలో కాశీపతిని నియోజకవర్గ సలహాదారుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కాశీపతికి జర్నలిస్టులు అభినందనలు తెలిపారు.

## బెల్లంపల్లిలో బోనాల సందడి..

- రడగంబాల బస్తీలో ఘనంగా ఆషాఢ బోనాలు..
- అమ్మవారికి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రత్యేక పూజలు..
- భక్తిశ్రద్ధలతో కిటకిటలాడిన బస్తీ..





**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 12 (సిరి న్యూస్)**

ఆషాఢ మాస బోనాల పండుగ సందర్భంగా బెల్లంపల్లి నియోజకవర్గంలో భక్తిశ్రద్ధలు వెల్లివిరిశాయి. బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రడగంబాల బస్తీలో స్థానిక వార్డు కౌన్సిలర్ దామెర విజయ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆషాఢ బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. నియోజకవర్గంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలపై అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. బోనాల వేడుకల్లో భాగంగా బస్తీ మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు, భక్తి కార్యక్రమాలతో బస్తీలో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు, బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రత్నం సుకుమారి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్, కౌన్సిలర్ కంకటి ప్రణీత శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, బస్తీ మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాటను సమీక్షించిన ఎమ్మెల్యే జిఎంఆర్

**పటాన్ చెరు, ఆగస్టు 12, (సిరి న్యూస్):**

రాబోయే స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని, పటాన్ చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో నిర్వహించనున్న వేడుకల పై పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. బుధవారం సాయంత్రం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని మండల విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయు లతో వేడుకలపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి ఏటా మాదిరిగానే సంస్కృతిక కార్యక్రమాలు, మార్చ్ ఫాస్ట్, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు కార్యక్రమాలలో పాల్గొనేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనే ప్రతి పాఠశాలకు ఐదు వేల రూపాయల నగదు బహుమతి తో పాటు, ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలు సాధించిన పాఠశాలలకు 20 వేలు, 15 వేలు, 10 వేల రూపాయలు అందించనున్నట్లు తెలిపారు. దేశ స్వాతంత్ర ఘట్టాలను, సంస్కృతిని మరిపించేలా కార్యక్రమాలు రూపొందించాలని సూచించారు.

## ఆలేరులో ఐదు నెలల శిశువు మృతి

**ఆలేరు, ఆగస్టు 12** :యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని సాయి శ్రీ చిన్నపిల్లల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఐదు నెలల శిశువు మృతి చెందిన సంఘటన జరిగింది. ఆలేరు ఎస్సై వినయ్ తెలిపిన వివరాల ప్రకారం ఆత్మకూరు మండలం సింగారం గ్రామానికి చెందిన మందుల అనిల్, పద్మ దంపతుల కుమార్తె తన్వికు జ్వరం, జలుబు ఉండటంతో మంగళవారం సాయంత్రం ఆసుపత్రికి తీసుకువచ్చారు. బుధవారం ఉదయం శిశువుకు జ్వరం తీవ్రం కావడంతో తల్లిదండ్రులు మళ్లీ ఆసుపత్రికి తీసుకువచ్చారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం పెద్ద ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో శిశువు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శిశువుకు సరైన వైద్యం అందకపోవడం వల్లే మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ ఆసుపత్రి ఎదుట రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. వారి ఆందోళనకు ఎమ్మార్పీఎస్ నాయకులు మద్దతు తెలిపారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# అమరుల యాదిలో గీతన్నల చైతన్య బస్ యాత్ర..

- రామాయంపేట లో అపూర్వ స్వాగతం.
- పలు కీలక అంశాలపై చర్చ.
- రాష్ట్రంలో ఐదు లక్షల గీత కార్మిక కుటుంబాలు
- ప్రమాదాల నివారణకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలి.
- కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి.
- కల్లు గీత కార్మిక సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల రమణ.
- ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు.



**రామాయంపేట, ఆగస్టు 12 )సిరి న్యూస్)**

కల్లుగీత కార్మికుల సంక్షేమం, ఉపాధి భద్రత మరియు వృత్తి ఆధునీకరణే ధ్యేయంగా రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న 'గీతన్నల చైతన్య యాత్ర'కు రామాయంపేటలో అపూర్వ స్పందన లభించింది. కేజీకేఎస్ (KGKS) ఆధ్వర్యంలో మానుకోట నుండి హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వరకు చేపట్టిన ఈ చారిత్రాత్మక బస్సు యాత్రకు మద్దతుగా బుధవారం రోజున రామాయంపేటలోని స్థానిక రేణుక మాత ఆలయంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సమరసత సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల రమణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు హాజరై ప్రసంగించారు. రామాయంపేట పట్టణ గౌడ సంఘం అధ్యక్షుడు పల్లె శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు కన్నపురం కృష్ణ గౌడ్ మరియు గౌడ సంఘ సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొన్న ఈ సభలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... రాష్ట్రంలో దాదాపు 5 లక్షల గీత కార్మిక కుటుంబాలు ప్రకృతి ప్రసాదించిన కోటి తాటి, ఈత చెట్లపైనే ఆధారపడి జీవిస్తున్నాయని గుర్తుచేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వృత్తిలో ఆధునిక మార్పులు తీసుకురావాలని, ప్రమాదాల నివారణకు ప్రభుత్వం తగిన రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. కామ్రేడ్ ధర్మభిక్షం, ఎస్.ఆర్. దాట్ల లాంటి త్యాగధనుల ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో గీత కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని తక్షణమే నెరవేర్చాలి.

### పెన్షన్ & ఎక్స్ గ్రేషియా

పెన్షన్ రూ.4,000కు, ప్రమాద ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలకు పెంచి, రాష్ట్రంలో ఎక్కడ ప్రమాదం జరిగినా వర్తింపజేయాలి.

### వయోపరిమితి పెన్షన్:

జీవో ప్రకారం 50 సంవత్సరాలు దాటిన గీత కార్మికులందరికీ వెంటనే పెన్షన్ మంజూరు చేయాలి.

### బకాయిల విడుదల:

పెండింగ్‌లో ఉన్న రూ.20 కోట్ల ఎక్స్‌గ్రేషియా నిధులను వెంటనే బాధితులకు చెల్లించాలి.

### వృక్ష సంరక్షణ:

రాష్ట్రంలోని కోటి తాటి, ఈత చెట్లకు నంబర్లు వేసి రక్షించాలి; చెట్లను నరికివేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఈ నెల 18న హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద ముగిసే ఈ మహోద్యమ యాత్రను గీత కార్మికులందరూ ఏకమై జయప్రదం చేయాలని మేకపోతుల రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట మాజీ సర్పంచ్ పల్లె రామచంద్ర గౌడ్, కల్లుగీత కార్మిక సంఘం నాయకులు మధునాల స్వామి గౌడ్, చిన్న రామా గౌడ్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

# ప్రమాదాలకు నిలయంగా మారిన వై జంక్షన్ మూసివేయాలి

- రాజకీయాలకు అతీతంగా
- ఒక రోజు ధర్నా చేసి, హైవే దిగ్బంధనం చేద్దాం.
- అప్పుడే పరిష్కారం దొరుకుతుంది.
- ఈ విషయంలో ప్రతి ఒక్కరూ స్పందించాలి.
- బిఆర్ఎస్ పార్టీ నాయకుడు ఎస్కే హైమద్.

**రామాయంపేట, ఆగస్టు 12 (సిరి న్యూస్)**



ప్రమాదాలకు నిలయంగా మారిన రామాయంపేట జాతీయ రహదారి ఆధ్యా హోటల్ ఎదురుగా ఉన్న వై జంక్షన్ ను వెంటనే మూసివేయాలని, లేనిపక్షంలో రామాయంపేట పట్టణంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీల నాయకులు స్వచ్ఛంద సంస్థల నాయకులు, అన్ని కుల సంఘాలతో కలిసి ఒకరోజు ధర్నా, హైవే దిగ్బంధనానికి ప్లాన్ చేస్తున్నట్లు బిఆర్ఎస్ పార్టీ నాయకుడు ఎస్.కె.హైమద్ తెలిపారు. బైపాస్ y జంక్షన్ వద్ద ఎన్నో ప్రాణాలు పోతున్నాయి. అక్కడ మనము,మన కుటుంబ సభ్యులు కూడా అక్కడినుండి భయంగా ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నాము .అక్కడ బ్రిడ్జ్ సాక్షన్ అయ్యింది. కానీ పనులు స్టార్ట్ అయ్యేలోపు చాలా టైం పట్టేలా ఉంది. ఈ గడిచిన 10 రోజుల్లోనే ఏంతో మంది గాయలపాయ్యారు.. మరియు ప్రాణాలు సైతం పోయాయని హైమద్ వివరించారు. కొందరు నాయకులు స్పందించి డ్రమ్ములతో రోడ్డుని క్లోజ్ చేశారు. కానీ పోలీస్ అధికారులు ఇది కరెక్ట్ కాదు.. అక్కన్నపేట బ్రిడ్జ్ వద్ద లైటింగ్ వేపించాక ఇక్కడ క్లోజ్ చేద్దాం అనీ చెప్పడం జరిగిందన్నారు.దీనిపైన రామాయంపేట మండల మరియు పట్టణ ప్రజలు, యువకులు, కుల సంఘాల పెద్ద మనుషులు, వర్తక వ్యాపారస్తులు, ముఖ్యంగా y జంక్షన్ వద్ద జరుగుతున్న ప్రతీ సమస్యను మరియు ప్రమాధాలకు సంబందించిన వార్తలను మన కళ్ళ ముందు చూపిస్తున్న పత్రిక ప్రింట్ / ఎలక్ట్రానిక్ మీడియా, అలాగే నిత్య0 అటు వైపు నుండి ప్రయాణం చేస్తూ మన పట్టణంలోని విద్యా సంస్థలకు విద్యార్థులు వస్తున్నారని, విద్యా సంస్థల ఆధిపతులు ,విద్యార్థి నాయకులు పార్టీలకు అతీతంగా రాజకీయ నాయకులు ప్రతీ ఒక్కరూ వై జంక్షన్ మూసివేతపై స్పందించాలని ఆయన పిలుపునిచ్చారు. మనందరం ఒక రోజు ధర్నా రోడ్డు దిగ్బన్దం చేస్తేనే పరిష్కారం దొరుకుతుందనీ,కాబట్టి ప్రతీ ఒక్కరూ స్పందించాలనీ హాయ్ మధు విజ్ఞప్తి చేశారు.

# మహంకాళి అమ్మవారి ఆలయంలో భక్తుల ప్రత్యేక పూజలు

**వెల్దుర్తి, ఆగస్టు12, (సిరి న్యూస్):**



వెల్దుర్తి మండలం మన్నేవారి జలాల్పూర్ లోని మహంకాళి అమ్మవారి దేవాలయంలో అమావాస్య సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం నిర్వహించడంతో పాటు ఆలయ ప్రాంగణంలో హోమాన్ని ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మ వారి ఆశీస్సులు పొందారు. అనంతరం వెల్దుర్తి గ్రామానికి చెందిన భక్తుడు పొన్నం ప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు అలాగే మాజీ జడ్పిటిసి రమేష్ గౌడ్, గ్రామ సర్పంచ్ రంగి కృష్ణ , ఆలయ చైర్మన్ సత్య నారాయణ,చేతుల మీదుగా మహంకాళి అమ్మవారి పాటల సిడి ని ఆవిష్కరించారు. అనంతరం లింగాపూర్ గ్రామానికి చెందిన భక్తుడు బొగ్గుల కృష్ణ ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వారి బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రతి అమావాస్య రోజున ఆలయ ప్రాంగణంలో హోమం, నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయంలో నిర్వహించే ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మ వారి ఆశీస్సులు పొందాలని కోరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యేక పూజలు, హోమాల్లో పాల్గొనదలచిన భక్తులు ముందు రోజు దేవాలయ కమిటీ సభ్యులను సంప్రదించాలని సూచించారు. ఆలయంలో భక్తుల సౌకర్యార్థం పూజా కార్యక్రమాలను క్రమబద్ధంగా నిర్వహిస్తున్నామని, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని , చైర్మన్ కోరారు.

# యువతే కాంగ్రెస్ బలం.. కష్టపడే వారికి ఉజ్వల భవిష్యత్తు...

- వేం నరేందర్ రెడ్డి
- యువ శక్తికి కాంగ్రెస్ వేదిక.. ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగాలి
- యువ నాయకుడు రహమతుల్లాకు వేం నరేందర్ రెడ్డి దిశానిర్దేశం

**హన్మకొండ, ఆగస్టు 12** : రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డిని బుధవారం కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు రహమతుల్లా మహమ్మద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలు, యువత రాజకీయాల్లో మరింత చురుకైన పాత్ర పోషించాల్సిన అంశాలపై వేం నరేందర్ రెడ్డి దిశానిర్దేశం చేశారు.ప్రజలతో మమేకమై, వారి సమస్యలను తెలుసుకుంటూ నిరంతరం ప్రజాసేవలో ముందుండాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు యువ నాయకులు అంకితభావంతో పనిచేయాలన్నారు.కష్టపడి పనిచేసే యువతకు కాంగ్రెస్ పార్టీలో మంచి అవకాశాలు, ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. పదవుల కోసం కాకుండా ప్రజల కోసం పనిచేసే నాయకత్వమే రాజకీయాల్లో చిరస్థాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. సేవా దృక్పథంతో ముందుకు సాగుతూ మంచి పనులు చేయడం ద్వారా ప్రజల్లో మంచి పేరు, విశ్వాసం సంపాదించుకోవాలని రహమతుల్లా కు సూచించారు.ఈ సందర్భంగా రహమతుల్లా మహమ్మద్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి విలువైన సూచనలు, ప్రోత్సాహం అందించిన వేం నరేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం మరింత అంకితభావంతో పనిచేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. యువతను ప్రోత్సహిస్తూ, ప్రజాసేవకు



మార్గనిర్దేశం చేసిన వేం నరేందర్ రెడ్డి సూచనలు తనకు మరింత స్ఫూర్తినిచ్చాయని రహమతుల్లా మహమ్మద్ పేర్కొన్నారు.

# గ్రామపంచాయతీలో కార్యనిర్వహణ అధికారి పెత్తనం..!?

- ఖాళీ స్థలాలకు సైతం ఇంటి నంబర్లు కేటాయించారంటూ సర్పంచ్ ఆరోపణ
- లేఅవుట్ లేకుండానే 21 స్థలాలకు అనుమతులు ఇచ్చారంటూ ఫిర్యాదు
- జూలై 16న అనుమతులు ఇచ్చినట్లు సర్పంచ్ ఆరోపణ
- పంచాయతీ రశీదు మొత్తానికి మించి వసూళ్లు చేశారంటూ లిఖితపూర్వక ఫిర్యాదు
- చెక్కులపై సంతకాల విషయంలో కార్యనిర్వహణ అధికారి తీరుపై సర్పంచ్ అభ్యంతరం
- కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన సర్పంచ్ జంగం రేణుక, మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్




**పెద్ద శంకరంపేట, (సిరి న్యూస్):**

పెద్ద శంకరంపేట గ్రామ పంచాయతీలో పాలన వ్యవహారాలు సర్పంచ్‌కు సమాచారం లేకుండానే కొనసాగుతున్నాయా..? పంచాయతీ పరిధిలో అనుమతులు, ఇంటి నంబర్ల కేటాయింపు, వసూళ్ల వ్యవహారాల్లో కార్యనిర్వహణ అధికారి తీరుపై సర్పంచ్ జంగం రేణుక తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ పాలనలో సర్పంచ్, వార్డు సభ్యులకు సమాచారం లేకుండా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపిస్తూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.<గ్రామపంచాయతీ పరిధిలో ఖాళీ స్థలాలకు సైతం ఇంటి నంబర్లు కేటాయించినట్లు సర్పంచ్ ఆరోపించారు. అంతే కాకుండా ఎలాంటి లేఅవుట్ లేకుండానే 21 స్థలాలకు అనుమతులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. జూలై 16న ఈ అనుమతులు జారీ చేసినట్లు సర్పంచ్ తన ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం.

**లేఅవుట్ లేకుండానే 21 స్థలాలకు అనుమతులా..?**

లేఅవుట్ అనుమతులు లేకుండా 21 స్థలాలకు అనుమతులు ఎలా ఇచ్చారన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. నిబంధనలకు అనుగుణంగా అనుమతులు జారీ చేశారా..? లేక పంచాయతీ పాలకవర్గానికి సమాచారం లేకుండానే ప్రక్రియ పూర్తి చేశారా..? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని సర్పంచ్ కోరుతున్నారు.

అనుమతుల వ్యవహారంలో డబ్బులు తీసుకుని అనుమతులు ఇస్తున్నారంటూ వచ్చిన ఆరోపణలను కూడా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సర్పంచ్ తెలిపారు. అయితే ఈ ఆరోపణలపై పూర్తి స్థాయి విచారణ జరిగితేనే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

**పంచాయతీ రశీదు కంటే అధిక వసూళ్ల ఆరోపణ**

సర్వే నంబర్ 114కు సంబంధించిన వ్యవహారంలో గ్రామపంచాయతీ రశీదులో ఉన్న మొత్తానికి మించి వసూళ్లు చేశారంటూ లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ తెలిపారు. పంచాయతీకి చెల్లించాల్సిన మొత్తానికి, వసూలు చేసిన మొత్తానికి మధ్య వ్యత్యాసం ఎందుకు వచ్చిందనే అంశంపై అధికారులు విచారణ చేయాలని కోరుతున్నారు.

**చెక్కులపై సంతకాల విషయంలోనూ వివాదం**

గ్రామపంచాయతీకి సంబంధించిన చెక్కులపై సంతకాలు పెట్టే విషయంలో కూడా కార్యనిర్వహణ అధికారి ఇబ్బందులకు గురిచేస్తున్నారని సర్పంచ్ ఆరోపించారు. నోటిఫికేషన్ పత్రాలపై సంతకాలు చేసిన అనంతరం వాటిని తిరిగి సంతకం చేసి ఇవ్వడం లేదని పేర్కొన్నారు. పంచాయతీ పాలన సజావుగా సాగేందుకు అవసరమైన పత్రాల విషయంలో ఆలస్యం చేయడం వల్ల పాలనాపరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.

**కలెక్టర్ దృష్టికి వ్యవహారం**

గ్రామపంచాయతీలో జరుగుతున్న ఈ వ్యవహారాలపై ఇప్పటికే కలెక్టర్ దృష్టికి వివరాలు అందించినట్లు సర్పంచ్ జంగం రేణుక, మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్ తెలిపారు. పంచాయతీ అనుమతులు, ఇంటి నంబర్ల కేటాయింపు, వసూళ్లు, చెక్కుల వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను నిగ్గు తేల్చాలని వారు కోరుతున్నారు.

గ్రామపంచాయతీ పాలనలో ప్రజాప్రతినిధులకు సమాచారం లేకుండా కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారన్న ఆరోపణలు నిజమైతే బాధ్యత ఎవరిది..? నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు జారీ అయ్యాయా..? పంచాయతీ రశీదు మొత్తానికి మించి వసూళ్లు జరిగాయా..? అనే అంశాలపై ఉన్నతాధికారులు పారదర్శకంగా విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

# కాంట్రాక్ట్,ఔట్సోర్సింగ్ ఉద్యోగాలకు ఆహ్వానం

**ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ నితిన్ కాబ్రా**

**మెదక్ ఆగష్టు,12(సిరి న్యూస్)**

మెదక్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో కాంట్రాక్టు విధానంలో వివిధ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ నితిన్ కాబ్రా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.మెడికల్ కళాశాలలో 4 ప్రొఫెసర్లు, 5 అసోసియేట్ ప్రొఫెసర్లు, 06 సీనియర్ రెసిడెంట్లు, 03 ట్యూటర్లు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు.
అర్హత గల అభ్యర్థులు ఈ నెల 13నుండి 14 రోజు మధ్యాహ్నం మూడు గంటల వరకు ప్రభుత్వ మెడికల్ కాలేజ్ మెదక్ లో దరఖాస్తులు ఇవ్వాలన్నారు.మరియు మెడికల్ కళాశాల ఔట్సోర్సింగ్ ప్రతిపదికన పూర్తిగా తాత్కాలికంగా ఉద్యోగాల కోసం దరఖాస్తులు కోరుతున్నామన్నారు.
పోస్టుల వివరాలు ఖాళీల సంఖ్య
అనస్థీషియా టెక్నీషియన్-8,
ఆడియో మెట్రిక్ టెక్నీషియన్-1,
ఆడియో విజువల్ టెక్నీషియన్-1,
బార్బర్- 6, బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్-3,
కార్పెంటర్-1,
క్యాటలాగర్-1,
చైల్డ్ సైకాలజిస్ట్-1,
సిటీ టెక్నీషియన్-4,
డేటా ఎంట్రీ ఆపరేటర్లు- 37,డెంటల్ టెక్నీషియన్-1,
దోబీ/ప్యాకర్-6,
ఈసీజీ టెక్నీషియన్-4,
ఎలక్ట్రీషియన్-6,
గ్యాస్ ఆపరేటర్-4,
ల్యాబ్ అటెండర్-19,
మ్యూజియం అసిస్టెంట్ కం ఆర్టిస్ట్-1,
ఆఫీస్ సబర్డినేట్లు-24,
ప్లంబర్-2, సైకియాట్రిక్ సోషల్ వర్కర్-1,
రేడియో గ్రాఫిక్ టెక్నీషియన్-7,
రేడియాలజీ టెక్నీషియన్-1,
రికార్డు క్లర్కు రికార్డు అసిస్టెంట్-2,
రిఫ్లెక్షన్ ఆపిటిషియన్-1,
స్పీచ్ తెరపి-1,
టైలర్-1,థియేటర్ అసిస్టెంట్-2,
ఓటి టెక్నీషియన్ అనస్థీసియా-10,
మొత్తం156 పోస్టులు ఉన్నాయని అభ్యర్థులు ఈ నెల13 ఉదయం 11 గంటల నుండి ఆగష్టు 20 మధ్యాహ్నం 3:00 వరకు ప్రభుత్వ మెడికల్ కళాశాల మెదక్ లో దరఖాస్తుల స్వీకరించబడతాయని తెలిపారు.మరిన్ని వివరాలు దరఖాస్తు ఫారం, దర్శకాలు విద్యార్హతల కోసం https://www.gmcmedak.org వెబ్సైట్ను సందర్శించాలని సూచించారు.

# కరాటేతో విద్యార్థుల్లో శారీరక దారుఢ్యం, ఆత్మవిశ్వాసం పెరుగుతుంది

**జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS**

**నారాయణపేట,ఆగస్టు,12**

విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, మార్షల్ ఆర్ట్స్‌లో కూడా రాణించాలని, కరాటే సాధనతో శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS అన్నారు.ఆగస్టు 9న హైదరాబాద్ చంపాపేట్‌లో జపాన్ షోటోకాన్ కరాటే ఆధ్వర్యంలో నిర్వహించిన మొదటి జాతీయ స్థాయి కరాటే పోటీల్లో నారాయణపేట జిల్లాకు చెందిన విద్యార్థులు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా విద్యార్థులు 4 బంగారు పతకాలు, 3 వెండి పతకాలు, 1 కాంస్య పతకం సాధించి నారాయణపేట జిల్లాకు గర్వకారణంగా నిలిచారు.జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను, కరాటే మాస్టర్లను జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS అభినందించి, ప్రశంస పత్రాలు, మెడల్స్ అందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్న వయస్సు నుంచే క్రీడలు, కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందడం ద్వారా శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతారని తెలిపారు. క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు.జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తూ,భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.డి. రియాజ్ హుల్ హక్, డీఎస్పీ మహేష్, టోర్నమెంట్ ఇంచార్జ్ మహమ్మద్ సలీం, జిల్లా ప్రెసిడెంట్ అశోక్, అనిల్ కుమార్, మండలాల ఇన్చార్జిలు తాయప్ప, తేయ్యాబ తది తరులు పాల్గొన్నారు.



# విగ్రహం జోలికొస్తే ప్రజాగ్రహం తప్పదు...

- 'పెద్ది' విగ్రహం తొలగించొద్దంటూ ఆర్డీవో, ఈస్ట్‌జోన్ డీసీపీకి బీఆర్ఎస్ నాయకుల వినతి
- ఉద్యమం నుంచి ప్రజాసేవ వరకు.. పెద్ది సుదర్శన్‌రెడ్డి స్మృతిని కాపాడుతాం
- నిరుపేదల కోసం వైద్య సేవల విప్లవం..'పెద్ది' జ్ఞాపకాన్ని చెరిపేయలేరు



**నర్సంపేట, ఆగస్టు 12 :** ఓరుగల్లు ఉద్యమ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే దివంగత పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించవద్దని కోరుతూ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు నర్సంపేట ఆర్డీవో, వరంగల్ ఈస్ట్‌జోన్ డీసీపీకి వినతిపత్రం అందజేశారు. ప్రజా సేవకు అంకితమైన నేత స్మారకంగా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని తొలగించే ప్రయత్నాలను వెంటనే నిలిపివేయాలని వారు కోరారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రజా జీవితంలో అందించిన సేవలకు గుర్తుగా ఆయన అభిమానులు విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో జిల్లా ఆసుపత్రి, మెడికల్ కళాశాల ఏర్పాటుకు ఆయన కృషి చేశారని పేర్కొన్నారు. అలాంటి ప్రజా సేవకుడి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన విగ్రహాన్ని రాజకీయ కారణాలతో తొలగించాలని చూడటం సరికాదన్నారు.విగ్రహ ఆవిష్కరణకు ముందు గద్దెను కూల్చివేసినా, అదే ప్రదేశంలో తిరిగి గద్దె నిర్మించి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆవిష్కరించామని వారు తెలిపారు. విగ్రహ ఆవిష్కరణను అడ్డుకునేందుకు ప్రయత్నాలు జరిగినప్పటికీ పార్టీ శ్రేణులు, అభిమానులు వెనక్కి తగ్గకుండా కార్యక్రమాన్ని పూర్తి చేశారని పేర్కొన్నారు.రాజకీయ కుట్రలో భాగంగా పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించే ప్రయత్నాలు చేస్తే నియోజకవర్గ ప్రజలు, పార్టీ శ్రేణుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గి విగ్రహంపై ఎలాంటి చర్యలు తీసుకున్నా ప్రజలు క్షమించరని అన్నారు.పెద్ది సుదర్శన్‌రెడ్డి ఉద్యమకారుడిగా, ప్రజా నాయకుడిగా నర్సంపేట ప్రాంతానికి చేసిన సేవలను గుర్తించి ఆయన స్మారకాన్ని గౌరవించాలని కోరారు. విగ్రహాన్ని తొలగించే ప్రయత్నం జరిగితే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పెద్ది సుదర్శన్‌రెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

## గుండ్లకుంటలో పలు అభివృద్ధి పనులను పరిశీలించిన మున్సిపల్ చెర్మైన్ నందారం ప్రశాంత్



**ఆగస్టు,12**

కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు గుండ్లకుంట గ్రామంలో మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. గ్రామంలో నిర్మాణంలో ఉన్న నూతన పాఠశాల భవనం, డ్రైనేజీ పనులు, వాటర్ ట్యాప్ కనెక్షన్లు, విద్యుత్ పనులు, సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ తో కలిసి పరిశీలించారు.పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న ఆయన, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములకు ఫెన్సింగ్ వేయాలి

**కలెక్టర్ హైమావతి.**



**రాయపోల్,ఆగస్టు 12:**

ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి తహసీల్దార్లను ఆదేశించారు. బుధవారం రాయపోల్ మండలం కొత్తపల్లి శివారులోని సర్వే నంబర్ 265లో గల 6 ఎకరాలు, మండల కేంద్రంలోని సర్వే నంబర్ 729లోని 5 ఎకరాల ప్రభుత్వ స్థలాలను అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రభుత్వ భూముల రికార్డులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ భూములకు హద్దులు నిర్ణయించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఆక్రమణలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ భూముల్లో తహసీల్దార్, పోలీస్ తదితర భవనాల నిర్మాణాలకు అనువైన స్థలాలను గుర్తించి త్వరితగతిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో చంద్రకళ, తహసీల్దార్ కృష్ణమోహన్, సర్పంచ్ రాజు, సర్వేయర్ సిద్దార్థ్, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కొలనుపాక వాగు వంతెన పనుల పరిశీలన

**నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మాజీ ఎంపీపీ**



**ఆలేరు, ఆగస్టు 12 :** కొలనుపాక వాగుపై ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హై లెవెల్ వంతెన నిర్మాణ పనులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ గంధమల్ల అశోక్ స్థానిక నాయకులతో కలిసి బుధవారం పరిశీలించారు. పనుల పురోగతిని తెలుసుకుని, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వేగంగా పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. వంతెన నిర్మాణం పూర్తయితే దశాబ్దాలుగా రాకపోకల ఇబ్బందులు ఎదుర్కొంటున్న కొలనుపాక, పరిసర ప్రాంతాల ప్రజలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అశోక్ తెలిపారు. కార్యక్రమంలో గాదె సోమిరెడ్డి, ఇమ్రాన్ ఖాన్, వార్డు సభ్యులు సిహెచ్. రమేష్, ఎం. సత్తయ్య, వి. పరశురాములు, వి. నరసింహులు, డాక్టర్ రమేష్, సాయి, దూడల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ

**బొంరస్ పేట మండలం, ఆగస్టు,12**



తెలంగాణ విద్యాశాఖ ఆదేశాల మేరకు, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంకల్పంతో బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు అందించాలనే ఉద్దేశంతో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు టై, బెల్టులను అందజేశారు.ఈ కార్యక్రమంలో టేకులగడ్డ తండా ప్రధానోపాధ్యాయులు గోపాల్, ఎంఆర్పీ సిబ్బంది గౌస్, ఐఆర్పీ వేణుగోపాల్, ఉన్నత పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిని ఈ సందర్భంగా వారు అభినందించారు.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.



2

# నేటి నుండి బొంతపల్లి వీరభద్ర స్వామి శ్రావణమాస ఉత్సవాలు

- బొంతపల్లికి తరలి రానున్న భక్తజనం
- నెలరోజుల పాటు ప్రత్యేక పూజలు


www.siridaily.com

RNI TG TEL/ 26/A0381

# సిరి

People's Voice వార్తపత్రిక

గురువారం
ఆగస్టు-13-2026

సంపుటి (Volume) : 2
సంచిక (Issue) 213

MEDAK, SANGAREDDY, SIDDIPET

పేజీలు : 5






# కలెక్టర్ తీరుపై అసంతృప్తి!?

సీఎంకు ఫిర్యాదు చేసేందుకు రంగం సిద్ధం

- సంగారెడ్డి కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై ప్రజాప్రతినిధుల ఆగ్రహం
- బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ముందుకు సాగని కీలక ఫైళ్లు
- రెవెన్యూ దస్త్రాలు క్లియర్ చేయకపోవడంతో జిల్లా పాలనలో స్తబ్ధత
- కోర్టు ఆర్డర్ ద్వారా వచ్చిన దస్త్రాలను మాత్రమే పరిశీలిస్తున్న వైనం
- సమస్యలు తీరక నిరంతరం కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్న ప్రజలు
- ఎమ్మెల్యేలు, ఇన్చార్జులు చెప్పిన పనులనూ చేయకపోవడంపై అసహనం
- ప్రజల్లో ముఖం చూపించుకోలేకపోతున్నామని పాలకవర్గ నేతల ఆవేదన
- 15న సంగారెడ్డికి రానున్న సీఎంతో ఫిర్యాదుకు సిద్ధమవుతున్న నేతలు

4

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ వ్యవహార శైలిపై జిల్లాలోని అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్చార్జులు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఆయన బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి కలెక్టరేట్‌లో కీలకమైన ఫైళ్లు క్లియర్ కావడం లేదని, ఫలితంగా జిల్లా వ్యాప్తంగా పాలన త్రిశంకు స్వర్గంలో పడి స్తబ్ధత నెలకొందనే ప్రచారం జోరుగా సాగుతోంది. ముఖ్యంగా ప్రజలు, రైతుల జీవితాలతో ముడిపడి ఉన్న రెవెన్యూ విభాగానికి సంబంధించిన సమస్యల దస్త్రాలు ఏమాత్రం ముందుకు సాగడం లేదని అధికార పార్టీ నేతలు మండిపడుతున్నారు.

(ప్రత్యేక ప్రతినిధి-సిరి న్యూస్)





## శాశ్వత మరమ్మతులకు మోక్షం లేదా?

- కానుకుంట రోడ్డుపై గుంతలే గుంతలు
- నిధులు మంజూరైనా పనులు మాత్రం ముందుకు సాగని వైనం
- ప్రతిరోజూ నరకయాతన అనుభవిస్తున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

5

గుమ్మడిదల, ఆగస్టు 12 సిరి న్యూస్ ): రోడ్డుపై గుంతలు.. గుంతల్లో నీరు.. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి.. ఇదీ కానుకుంట రోడ్డు దుస్థితి. గత కొన్ని సంవత్సరాలుగా మరమ్మతులకు నోచుకోక అధ్వానంగా మారిన ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



## ప్రజల ప్రాణాల రక్షణ కోసమే వై జంక్షన్ మూసివేత!

అధికారుల కీలక నిర్ణయం

కోమటిపల్లి జంక్షన్ కూడా..

- సర్వీసు రోడ్డు పునరుద్ధరణ.
- బుధవారం రాత్రి పరిశీలించిన తూప్రాన్ డిఎస్పి నరేందర్ గౌడ్.
- రెండు రోజుల్లో మూసివేతపై చర్యలు

3

## బీజేపీ పోరాట ఫలితమే

- సుదీర్ఘ పోరాటానికి విజయమే నాంది
- ప్రజల ప్రాణాల రక్షణే బీజేపీ ప్రధాన లక్ష్యం
- బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు

3





# ఎమ్మార్పీఎస్ కమిటీలన్నీ రద్దు

రామాయంపేట, ఆగస్టు 12 (సిరి న్యూస్) ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు బుధవారం నాడు రామాయంపేట మండల కేంద్రంలో రామాయంపేట మండల ఎంఆర్పిఎస్ మరియు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో సమావేశం జరిగింది.మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు గ్రామ కమిటీ నుండి మొదలుకొని జిల్లా కమిటీలు అన్ని రద్దు చేయడం జరిగింది. ప్రతి గ్రామంలో, ప్రతి మండలంలో, జిల్లాలో నూతన కమిటీలు ఏర్పాటు చేయాలనీ, మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రామాయంపేటలో మండల కమిటీ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందనీ నిర్వాహకులు తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీ సీనియర్ నాయకుడు పాతూరి రాజు మాదిగ ,దళిత నాయకులు విద్యాశాంత్ కుమార్, ఎంఆర్పిఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు మల్యాల కిషన్, మాదిగ ఎమ్మార్పీ ఎస్ జిల్లా కమిటీ కార్యదర్శి రాజు మాదిగ ,ఎమ్మార్పీఎస్ మండల కమిటీ మాజీ అధ్యక్షులు ఎర్ర నరేష్ మాదిగ, మాజీ అధికార ప్రతినిధి బుర్ర శేఖర్ ,వికలాంగుల జిల్లా అధ్యక్షులు కుమారి కుమార్, వికలాంగుల జిల్లా గౌరవాధ్యక్షులు గంగాపురం సంజీవ్, మరియు వికలాంగుల నాయకులు పరశురాం, జేరిపోతుల శ్రీకాంత్ మాదిగ పాతూరి శ్రీను, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు తెలుగు పెంటయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు

# మాజీ మంత్రి హరీష్ రావును కలిసిన తూప్రాన్ బిఆర్ఎస్ నాయకులు

తూప్రాన్ ఆగస్టు 12 సిరి న్యూస్ తూప్రాన్ మున్సిపల్ బి ఆర్ ఎస్ నాయకులు బుధవారం మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ను మర్యాదపూర్వకంగా సిద్దిపేట లోని క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన తూప్రాన్ మాజీ మున్సిపల్ చైర్మన్ బొంది రవీందర్ గౌడ్ పట్టణ పరిధిలోని బి ఆర్ఎస్ నాయకులు కౌన్సిలర్లు కార్యకర్తలు కలిసి పార్టీ విధి విధానాలతో పాటు ప్రజలకు బి ఆర్ ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అందిన సంక్షేమ పథకాలను గుర్తుచేస్తూ పార్టీని బలోపేతం చేస్తున్నట్టు తెలిపారు








# నేటి నుండి బొంతపల్లి వీరభద్ర స్వామి శ్రావణమాస ఉత్సవాలు

**– బొంతపల్లికి తరలిరానున్న భక్తజనం – నెలరోజుల పాటు ప్రత్యేక పూజలు**

**గుమ్మడిదల, ఆగస్టు 12 (సిరి న్యూస్ ):** గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలోని బొంతపల్లి గ్రామంలో దైవక్షేత్రంగా పేరుగాంచిన శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయంలో శ్రావణమాస ఉత్సవాలు ఈనెల 13వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. నెలరోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో ప్రతిరోజూ స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బొంతపల్లి వీరభద్ర స్వామి ఆలయంలో ప్రతి సంవత్సరం శ్రావణమాస ఉత్సవాలతో పాటు బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవాల సందర్భంగా నెలరోజుల పాటు ఆలయానికి భక్తుల తాకిడి కొనసాగుతుంది. తెలంగాణ రాష్ట్రం నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. ముఖ్యంగా శ్రావణమాసంలోని చివరి సోమవారం, శుక్రవారం రోజుల్లో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉందని ఆలయ అధికారులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కార్యనిర్వహణ అధికారి రామబ్రహ్మాచారి కోరారు.

## ప్రతిరోజూ ప్రత్యేక పూజలు

ఈనెల 13వ తేదీ నుంచి సెప్టెంబర్ 11వ తేదీ వరకు నెలరోజుల పాటు శ్రావణమాస ఉత్సవాలు కొనసాగుతాయని ఆలయ కార్యనిర్వహణ అధికారి తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉదయం బిందె తీర్థం, ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు భక్తులచే ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకు అన్నపూజలు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల వరకు గణపతి పూజ, లక్షపత్రి పూజ నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు నిత్యకల్యాణం, సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు భక్తుల కోసం ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగనున్నాయి.

## ప్రతిరోజూ లక్ష బిల్వార్చన

శ్రావణమాసం సందర్భంగా వీరభద్ర స్వామి ఆలయంలో భక్తుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ లక్ష బిల్వార్చన పూజా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి తెలిపారు. నెలరోజుల పాటు జరిగే ఈ లక్ష బిల్వార్చనలో పాల్గొనదలచిన భక్తులు రూ.1,516 చెల్లించి తమ పేరుతో పూజా కార్యక్రమాన్ని నిర్వహించుకోవచ్చని తెలిపారు. ఆసక్తి ఉన్న భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శ్రావణమాస పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆలయ అధికారులు కోరారు





# ప్రజల ప్రాణాల రక్షణ కోసమే వై జంక్షన్ మూసివేత!

## అధికారుల కీలక నిర్ణయం




- వైస్ జంక్షన్ తో పాటుగా కోమటిపల్లి జంక్షన్ కూడా మూసివేత.
- సర్వీసు రోడ్డు పునరుద్ధరణ.
- బుధవారం రాత్రి పరిశీలించిన తూప్రాన్ డిఎస్పి నరేందర్ గౌడ్.
- రెండు రోజుల్లో ముసివేతపై చర్యలు



రామాయంపేట, ఆగస్టు 12 (సిరి న్యూస్) మెదక్ జిల్లా రామాయంపేట పట్టణ పరిధిలోని 44వ జాతీయ రహదారిపై ఉన్న వై జంక్షన్‌ను మూసివేయాలని అధికారులు నిర్ణయించారు. వై జంక్షన్ వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటుండటంతో ప్రయాణికుల ప్రాణాలకు రక్షణ కల్పించే చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. బుధవారం రాత్రి తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, మున్సిపల్ పాలకవర్గం సభ్యులు, మున్సిపల్ కమిషనర్, పోలీస్ అధికారులతో కలిసి వై జంక్షన్‌ను పరిశీలించారు. జంక్షన్ వద్ద ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. వై జంక్షన్‌తో పాటు కోమటిపల్లి జంక్షన్‌ను కూడా మూసివేయాలని అధికారులు నిర్ణయించారు. ప్రయాణికుల ప్రాణాల రక్షణే ప్రధాన లక్ష్యంగా జంక్షన్‌ను మూసివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. రెండు రోజుల్లోనే వై జంక్షన్ మూసివేతకు సంబంధించిన చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అయితే వై జంక్షన్ మూసివేతతో కోమటిపల్లి గ్రామస్తులకు ఇబ్బందులు కలగకుండా సర్వీస్ రోడ్డును పునరుద్ధరించాలని అధికారులు నిర్ణయించారు. దీంతో గ్రామస్తులకు రాకపోకల్లో ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ మార్గాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. తరచూ ప్రమాదాలకు కేంద్రంగా మారిన వై జంక్షన్ మూసివేతతో ప్రమాదాల సంఖ్య తగ్గి ప్రయాణికులకు మరింత భద్రత కలుగుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డిఎస్పి నరేందర్ గౌడ్, రామాయంపేట సిఐ సైదా నాయక్, రామాయంపేట ఎస్సై బాలరాజు, నిజాంపేట ఎస్సై రాజేష్, మున్సిపల్ కమిషనర్ రవీందర్, కౌన్సిలర్లు గజవాడ నాగరాజు గుప్తా, దేవుని రంజిత్, పుట్టి సందీప్, తదితరులు పాల్గొన్నారు.






# బీజేపీ పోరాట ఫలితమే

- సుదీర్ఘ పోరాటానికి విజయమే నాంది
- ప్రజల ప్రాణాల రక్షణే బీజేపీ ప్రధాన లక్ష్యం
- బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు



**రామాయంపేట, ఆగస్టు 12 (సిరి న్యూస్)** రామాయంపేట వై జంక్షన్ వద్ద తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో గత రెండు, మూడు సంవత్సరాలుగా చేస్తున్న సుదీర్ఘ పోరాటానికి నేడు ఫలితం లభించిందని బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. నేషనల్ హైవే అథారిటీ అధికారులు, పోలీస్ శాఖ అధికారులు సుదీర్ఘంగా చర్చించిన అనంతరం వై జంక్షన్‌ను మూసివేయడానికి సానుకూల నిర్ణయం తీసుకోవడాన్ని భారతీయ జనతా పార్టీ స్వాగతించింది. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు మాట్లాడు తూ.. రామాయంపేట వై జంక్షన్ వద్ద గతంలో అనేక ప్రమాదాలు జరిగి 33 మంది ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో, ప్రజల ప్రాణాలను కాపాడేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని భారతీయ జనతా పార్టీ మొదటి నుంచి అధికారులను కోరుతూ వస్తోందన్నారు. ఈ సమస్యపై స్థానిక తహసీల్దార్, పోలీస్ అధికారులను కలిసి వినతిపత్రాలు అందించడంతో పాటు కలెక్టర్‌ను కలిసి ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలని పలుమా ర్లు డిమాండ్ చేసినట్లు తెలిపారు. మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు ప్రత్యేక చొర వతో కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ని కలిసి రామాయంపేట వై జంక్షన్ వద్ద జరుగుతున్న ప్రమాదాల తీవ్రతను వివరించడం జరిగిందన్నారు. ఎంపీ చొరవతో కేంద్ర మంత్రి ఆదేశాల మేరకు ప్రమాదాల నివారణకు సుమారు రూ.47 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేసి, అనంత రం ఆ ప్రతిపాదనకు ఆమోదం లభించిందని తెలిపారు. టెండర్ ప్రక్రియ కూడా పూర్తయిందని, త్వరలోనే ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని రాగి రాముడు పేర్కొన్నారు. అయితే ఫ్లైఓవర్ నిర్మాణానికి కొంత సమయం పట్టే పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలకు మరింత ముప్పు కలగకుండా తక్షణమే వై జంక్షన్‌ను మూసివేయాలని బీజేపీ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో నిన్న భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో వై జంక్షన్‌ను తాత్కాలికంగా మూసివేసి ప్రమాదాల నివారణకు అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చినట్లు తెలిపారు. బీజేపీ ఒత్తిడి, ప్రజల భద్రతపై పార్టీ చేసిన నిరంతర పోరాటం, అధికారులతో జరిపిన చర్చల ఫలితంగానే నేడు రెవెన్యూ, పోలీస్ శాఖల సమన్వయంతో వై జంక్షన్ మూసివేతకు నిర్ణయం తీసుకోవడం శుభ పరిణామమని రాగి రాములు అన్నారు. "రాజకీయాలకు అతీతంగా ప్రజల ప్రాణాలే మాకు ముఖ్యం. ఒక్క ప్రాణాన్ని కాపాడటం కూడా మా బాధ్యత. వై జంక్షన్ వద్ద ప్రమాదాల నివారణకు శాశ్వత పరిష్కారం వచ్చే వరకు బీజేపీ ప్రజల తరఫున పోరాడుతూనే ఉంటుంది" అని హాయ్ స్పష్టం చేశారు. వై జంక్షన్ మూసివేతకు చొరవ చూపిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, స్థానిక డీఎస్పీ, సీఐ, రామాయంపేట తహసీల్దార్, ఎస్సై తదితర పోలీస్, రెవెన్యూ అధికారులకు భారతీయ జనతా పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని తక్షణ చర్యలు చేపట్టిన అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అక్కన్నపేట సర్పంచ్ బక్కయ్య గారి యాదగిరి, మాజీ సర్పంచ్ వెలుముల సిద్ధ రాములు, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి చింతల శేఖర్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు శీలం అవినాష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అనిల్ ప్రవీణ్, బీజేపీ సీనియర్ నాయకులు పబ్బ సత్యం తదితరులు పాల్గొన్నారు.



# కలెక్టర్ తీరుపై అసంతృప్తి!?

## సీఎంకు ఫిర్యాదు చేసేందుకు రంగం సిద్ధం

- సంగారెడ్డి కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై ప్రజాప్రతినిధుల ఆగ్రహం
- బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ముందుకు సాగని కీలక ఫైళ్లు
- రెవెన్యూ దస్త్రాలు క్లియర్ చేయకపోవడంతో జిల్లా పాలనలో స్తబ్దత
- కోర్టు ఆర్డర్ ద్వారా వచ్చిన దస్త్రాలను మాత్రమే పరిశీలిస్తున్న వైనం
- సమస్యలు తీరక నిరంతరం కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్న ప్రజలు
- ఎమ్మెల్యేలు, ఇన్చార్జులు చెప్పిన పనులనూ చేయకపోవడంపై అసహనం
- ప్రజల్లో ముఖం చూపించుకోలేకపోతున్నామని పాలకవర్గ నేతల ఆవేదన
- **15**న సంగారెడ్డికి రానున్న సీఎంతో ఫిర్యాదుకు సిద్ధమవుతున్న నేతలు

**(ప్రత్యేక ప్రతినిధి-సిరి న్యూస్) : సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ వ్యవహార శైలిపై జిల్లాలోని అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్చార్జులు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఆయన బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి కలెక్టరేట్‌లో కీలకమైన ఫైళ్లు క్లియర్ కావడం లేదని, ఫలితంగా జిల్లా వ్యాప్తంగా పాలన త్రిశంకు స్వర్గంలో పడి స్తబ్దత నెలకొందనే ప్రచారం జోరుగా సాగుతోంది. ముఖ్యంగా ప్రజలు, రైతుల జీవితాలతో ముడిపడి ఉన్న రెవెన్యూ విభాగానికి సంబంధించిన సమస్యల దస్త్రాలు ఏమాత్రం ముందుకు సాగడం లేదని అధికార పార్టీ నేతలు మండిపడుతున్నారు.**

### పెండింగ్‌లో ఫైళ్లు.. పక్కన పెట్టిన అధికారులు...

కలెక్టర్ ప్రతీక్ జైన్ జిల్లా బాధ్యతలు చేపట్టిన కొత్తలో పరిపాలనా విషయాలను పూర్తిగా తెలుసుకోవాలనే ఉద్దేశంతో ఏ ఫైలునూ ముట్టుకోకుండా జాగ్రత్త పడ్డారు. ఆ తర్వాత ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ చేపట్టి దాదాపు 45 రోజుల పాటు పూర్తి సమయాన్ని దానికే కేటాయించారు. ఇలా ఏదో ఒక నెపం చూపిస్తూ నిత్యం ప్రాధాన్యత ఇవ్వాల్సిన రెవెన్యూ, పీఓబీ, మ్యుటేషన్లు, ఇనామ్ అబాలిషన్, మిస్సింగ్ సర్వే నంబర్లు, డాటా కరెక్షన్, హెచ్ఎండిఏ కిందకు వచ్చే కీలక ఫైళ్లను పూర్తిగా పక్కన పెట్టేశారన్న విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుతం కేవలం హైకోర్టు ఆర్డర్ల ద్వారా వచ్చిన ఫైళ్లను మాత్రమే క్లియర్ చేస్తున్నారని, నిబంధనల ప్రకారం క్లియర్‌గా ఉన్న ఇతర సాధారణ ఫైళ్లను యాక్సెప్ట్ గాని లేదా రిజెక్ట్ గాని చేయకుండా నాన్చుతున్నారని సమాచారం.


### ప్రజాప్రతినిధులకు ప్రాధాన్యత ఏది?

తమ భూ సమస్యలు, పట్టాదార్ పాస్ పుస్తకాల సవరణలు కాక సామాన్య ప్రజలు, నిరుపేద రైతులు నిరంతరం సంగారెడ్డి కలెక్టరేట్ ఆఫీసు చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే విషయమై అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్చార్జులు స్వయంగా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసినప్పటికీ, వారు చెప్పిన ఫైళ్లను కూడా క్లియర్ చేయకపోవడం గమనార్హం. గతంలో పనిచేసిన కలెక్టర్లు ఎంత బిజీగా ఉన్నప్పటికీ నిత్యం సమయం కేటాయించి ఫైళ్లను పరిశీలించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూసేవారని, కానీ ప్రస్తుత కలెక్టర్ మాత్రం ఏమాత్రం పట్టించుకోవడం లేదని ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేసేందుకు సిద్ధం..

రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ.. తమ వద్దకు రోజూ వచ్చే ప్రజలకు, రైతులకు చిన్న చిన్న పనులు కూడా చేయించలేక వారి ముందు ముఖం చూపించుకోలేకపోతున్నామని అధికార పార్టీ నేతలు తీవ్ర మనస్తాపం చెందుతున్నారు. అధికారంలో ఉండి కూడా పనులు చేయించకపోతే రాబోయే రోజుల్లో ప్రజల్లో పూర్తిగా చులకనైపోతామని భావించిన సదరు నేతలు, కలెక్టర్ తీరుపై సీరియస్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారాన్ని ఇలాగే వదిలేస్తే మరింత నష్టం జరుగుతుందని భావించి, ఈనెల 15వ తేదీన సంగారెడ్డి జిల్లా పర్యటనకు రానున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి కలెక్టర్ ప్రతీక్ జైన్ పనితీరును నేరుగా తీసుకువెళ్లడానికి సిద్ధమైనట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.






# శాశ్వత మరమ్మతులకు మోక్షం లేదా?

- కానుకుంట రోడ్డుపై గుంతలే గుంతలు
- నిధులు మంజూరైనా పనులు మాత్రం ముందుకు సాగని వైనం
- ప్రతిరోజూ నరకయాతన అనుభవిస్తున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

**గుమ్మడిదల, ఆగస్టు 12 సిరి న్యూస్ ):** రోడ్డుపై గుంతలు.. గుంతల్లో నీరు.. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి.. ఇదీ కానుకుంట రోడ్డు దుస్థితి. గత కొన్ని సంవత్సరాలుగా మరమ్మతులకు నోచుకోక అధ్వానంగా మారిన ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారికి శాశ్వత పరిష్కారం చూపించాలని పలుమార్లు కోరుతున్నా సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుమ్మడిదల నుండి కానుకుంట, రాంరెడ్డి బావి, వీరారెడ్డిపల్లి, అనంతారం, నవాబ్ పేట్ తదితర గ్రామాలకు వెళ్లే ఈ రహదారి ఆయా గ్రామాల ప్రజలకు ఎంతో కీలకమైనది. నిత్యం విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు, ద్విచక్ర వాహనదారులు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. అయితే రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది.

## రూ. 7 కోట్ల నిధులు.. పనులు మాత్రం ఎక్కడికక్కడే

రోడ్డుకు శాశ్వత మరమ్మతులు చేపట్టేందుకు ప్రభుత్వం సుమారు రూ.7 కోట్ల నిధులు మంజూరు చేసినప్పటికీ, కాంట్రాక్టర్లు పనులు చేపట్టేందుకు ముందుకు రాకపోవడంతో పనులు ప్రారంభం కాకుండానే నిలిచిపోయినట్లు తెలుస్తోంది. నిధులు మంజూరై కూడా రహదారి పరిస్థితిలో మార్పు రాకపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో సమస్యను పరిష్కరించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదనే కారణంతో సమస్యను వదిలేయకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించి పనులు ప్రారంభించాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

## ఒక్కసారి వెళ్తే.. మరోసారి వెళ్లాలంటే భయం!

ప్రస్తుతం రోడ్డుపై ఏర్పడిన భారీ గుంతల కారణంగా వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా వర్షాలు కురిసిన సమయంలో గుంతల్లో నీరు చేరడంతో వాటి లోతు తెలియక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ద్విచక్ర వాహనదారుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఈ రోడ్డుపై ఒక్కసారి ప్రయాణిస్తే చాలు మరోసారి ఇదే మార్గంలో వెళ్లాలంటే భయమేస్తోంది అంటూ ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ★ప్రత్యామ్నాయ మార్గం లేక తప్పని ప్రయాణం★

కానుకుంట, రాంరెడ్డిబావి, వీరారెడ్డిపల్లి, నవాబు పేట్ అనంతరం తదితర గ్రామాల ప్రజలకు ఈ రహదారి ప్రధాన రవాణా మార్గంగా ఉండటంతో ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడం సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది. రోడ్డు అధ్వానంగా ఉన్నప్పటికీ నిత్యావసరాల కోసం, ఉద్యోగాలు, విద్య, వైద్యం తదితర అవసరాల కోసం ప్రజలు ఇదే మార్గంలో ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది.

## గ్రామాల సర్పంచులు స్పందించాలి

తమ గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న ఈ సమస్యపై ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా దృష్టి సారించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ప్రజలు కోరుతున్నారు. కేవలం తాత్కాలిక మరమ్మతులతో సమస్యకు పరిష్కారం లభించదని, రహదారిని పూర్తిస్థాయిలో పునర్నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఇకనైనా కదలిక వస్తుందా?

దాదాపు రూ.7 కోట్ల నిధులు మంజూరైనప్పటికీ రహదారి పనులు ప్రారంభం కాకపోవడం పట్ల ప్రజల్లో అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడానికి కారణాలేమిటి? మంజూరైన నిధులతో పనులు ఎప్పుడు ప్రారంభిస్తారు? రహదారికి శాశ్వత పరిష్కారం ఎప్పుడు చూపిస్తారు? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు ఇకనైనా స్పందించి కానుకుంట రోడ్డుకు శాశ్వత మరమ్మతులు చేపట్టి ప్రయాణికుల కష్టాలకు చరమగీతం పాడాలని స్థానికులు కోరుతున్నారు.

